


# విజయభాను




హైదరాబాద్, బుధవారం 25-10-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 37 సంచిక : 41 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## జీఎస్‌టీ రిటర్న్‌లపై
# జరిమానా రద్దు


దిల్లీ: ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు గానూ జీఎస్‌టీ రిటర్న్‌లను గడువు పూర్తయిన తర్వాత దాఖలు చేసిన వారిపై జరిమానాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం వెల్లడించింది. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీఎస్‌టీ రిటర్న్‌లను ఆలస్యంగా చెల్లించిన వారిపై విధించిన జరిమానాను రద్దు చేస్తున్నాం అని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేడు ట్వీట్ చేశారు.

ఇప్పటి వరకు తీసుకున్న జరిమానాలను కూడా తిరిగి వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు జైట్లీ పేర్కొన్నారు. ఇంతకు ముందు జులై రిటర్న్‌లపై విధించిన జరిమానాను కూడా ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఆగస్టు,




సెప్టెంబర్‌లకు కూడా జరిమానాలను రద్దు చేయాలని వ్యాపార సంఘాల నుంచి డిమాండ్ వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇప్పటి వరకు ఉన్న డేటా ప్రకారం.. జులై నెలకు సంబంధించి 55.87 లక్షల జీఎస్‌టీ రిటర్న్‌లు, ఆగస్టుకు తరువాయి 2లో



## విప్లవాత్మకంగా
# కొత్త పంచాయతీరాజ్ చట్టం

- తెలంగాణలో గ్రామ స్వరాజ్యం
- గ్రామ సర్పంచ్‌లకు మరికొన్ని బాధ్యతలు
- పంచాయతీలుగా తండాలు, గూడేలు, చెంచు పల్లెలు
- రాష్ట్ర క్యాబినెట్ సమావేశం నిర్ణయాలు
- న్యాయకోవిదులతో సంప్రదించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. తండాలు, గూడేలు, చెంచు పల్లెలను పంచాయతీలుగా మార్చాలని నిర్ణయించింది. కొత్తగా మరిన్ని పంచాయతీలను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసే క్రమంలో ప్రధాన గ్రామానికున్న దూరాన్ని, శివారు పల్లెల జనాభాను, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసినప్పుడు వ్యవహరించినట్లుగానే కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసేటప్పుడు కూడా ఉదారంగానే ఉండాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు కొత్తగా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురావాలని తీర్మానించింది. కొత్తగా తెచ్చే ఈ చట్టం విప్లవాత్మకంగా ఉంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. గ్రామ పంచాయతీ చట్టం తెచ్చిన తర్వాత ప్రజలకు బాగా సేవలందించే విధంగా మున్సిపాలిటీలను మార్చడానికి కొత్త మున్సిపల్ చట్టం కూడా తేవాలని సీఎం ప్రతిపాదించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ద్వారా గ్రామాల్లో అద్భుతమైన, గుణాత్మకమైన మార్పు రావాలని సీఎం ఆకాక్షించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రారంభమైన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం సుదీర్ఘంగా దాదాపు ఎనిమిది గంటలపాటు సాగింది. ఇందులో ప్రధానంగా పంచాయతీలు, గ్రామ స్వరాజ్యంపై లోతైన చర్చ జరిగింది. ముఖ్యమంత్రి దీనిపై సుదీర్ఘ కసరత్తు చేశారు. మంత్రులు, అధికారుల అభిప్రాయాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. తరువాయి 2లో



## రాష్ట్రపతి రామ్‌నాథ్‌తో ఆఫ్ఘన్ అధ్యక్షుడు భేటీ

న్యూఢిల్లీ : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ గనీ భేటీ అయ్యారు. దేశ పర్యటనలో భాగంగా అష్రఫ్ గనీ.. మంగళవారం ఉదయం 8 గంటలకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

అనంతరం నేరుగా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన గనీ.. రామ్‌నాథ్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇక ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌తో ఆఫ్ఘన్ అధ్యక్షుడు సమావేశం కానున్నారు.

ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ సమస్యలతో పాటు ఉగ్రవాద సమస్యపై చర్చించనున్నారు.

# బొటానికల్ గార్డెన్ ఎదుట వాకర్ల ఆందోళన

### ఆవరణలో ఇతర నిర్మాణాలు వద్దని డిమాండ్



హైదరాబాద్: కొత్తగూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో నిర్మాణాలు చేపట్టవద్దంటూ గార్డెన్ వాకర్స్‌అసోసియేషన్ సభ్యులు ఆందోళనకు దిగారు. గార్డెన్ గేటు ఎదుట బైఠాయించి అటవీ అభివృద్ధి సంస్థ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.వి.రెడ్డి మాట్లాడతూ పచ్చదనం నిండి ఉన్న బొటానికల్‌గార్డెన్‌లో కొత్తగా నిర్మాణాలను చేపట్టడం సరికాదన్నారు. చెట్లను నరికి దాదాపు 20కాటేజ్‌లు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారన్నారు. గార్డెన్‌లో నిర్మాణాలు చేపట్ట వద్దని నిబంధనలు ఉన్నా వాటిని తుంగలోకి తొక్కి భారీ షెడ్లను నిర్మిస్తున్నారన్నారు. గార్డెన్ ప్రవేశ రుసుం రూ.15నుంచి రూ.25కు పెంచడం సరికాదన్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న పచ్చదనం నిండి ఉన్న ఏకైక ఉద్యానవనాన్ని నిర్మాణాలతో నాశనం చేస్తే ఉరుకునేది లేదని చెప్పారు. గార్డెన్‌లో చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన అటవీ అభివృద్ధి సంస్థ ఏడీ రవీందర్‌రెడ్డి గార్డెన్‌లో చేపడుతున్న పనులను వివరించే ప్రయత్నం చేయగా వాకర్లు వాగ్వాదానికి దిగారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆందోళన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ రవీందర్‌ముదిరాజ్, బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ తరువాయి 2లో

## ఈ కారణంగానే
# మోదీకి ప్రజాదరణ

- 41 నెలల్లో ఎన్ని ప్రసంగాలిచ్చారంటే...
- ప్రతీ మూడు రోజులకు కనీసం 2 ప్రసంగాలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిత్వం ఆయన ప్రసంగాల్లో వ్యక్తమవుతుంటుంది. ప్రధాన మంత్రి పదవి చేపట్టిన తరువాత ఆయన ప్రతీ నెలా 19 చొప్పున ప్రసంగాలిచ్చారు.

మే 26, 2014లో ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినది మొదలు ప్రతీ మూడు రోజులకు కనీసం 2 ప్రసంగాలిస్తూ వచ్చారు. ఈ కారణంగానే మోదీ ప్రజాదరణ చూరగొన్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రధాని పదవి చేపట్టాక మోదీ మొత్తం 775 బహిరంగ సభల్లో మాట్లాడారు. మోదీ ప్రసంగం కనీసం 30 నిమిషాల పాటు కొనసాగుతుంది.

2015లో ప్రధాని ఏకంగా 264 ప్రసంగాలిచ్చారు. కాగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తన 10 సంవత్సరాల పరిపాలనా కాలంలో మొత్తం 1401 ప్రసంగాలందించారు.




## 7 లక్షల కోట్లతో
# హైవేల అభివృద్ధి

న్యూఢిల్లీ: 7 లక్షల కోట్ల హైవే ప్రాజెక్ట్‌లకు మంగళవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో ప్రతిష్టాత్మక భారత్‌మాల ప్రాజెక్ట్ కూడా ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా దేశవ్యాప్తంగా తొలి దశలో 20 వేల కిలోమీటర్ల తరువాయి 2లో




## టేకిట్ ఈజీ




అపోజిషన్ పార్టీలకి తలనొప్పిగా ఉండేవాడు...
పార్టీ మారి ఇప్పుడు మనకి తలనొప్పిగా తయారయ్యాడు !

# నవంబర్ 8న బ్లాక్ డే

### నోట్ల రద్దుకు నిరసనగా నిర్ణయం

న్యూఢిల్లీ: పెద్ద నోట్లను రద్దు చేసి ఏడాది సమీపిస్తున్నది. ఈ నేపథ్యంలో నవంబర్ 8వ తేదీన ప్రతిపక్షాలు బ్లాక్‌డే నిర్వహించనున్నాయి. పాత 500, వెయ్యి రూపాయల నోట్లను గత ఏడాది నవంబర్ 8వ తేదీన రద్దు చేస్తూ ప్రధాని మోదీ ప్రటకన చేశారు.

ప్రధాని ప్రకటనకు నిరసనగా వచ్చే నెల 8వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రాజ్యసభ ప్రతిపక్ష నేత గులామ్ నబీ ఆజాద్ తెలిపారు. అన్ని విపక్ష పార్టీలతో కలిసి ఈ ఆందోళన చేపట్టనున్నారు. చాలా తొందరపాటుగా ప్రభుత్వం నోట్ల రద్దు నిర్ణయాన్ని తీసుకున్నదని, ఒక్క నెలలోనే తాము తీసుకున్న నిర్ణయాన్ని 135 సార్లు మార్చినట్లు ఆజాద్ ఆరోపించారు. జేడీయూ, సీపీఐ, డీఎంకే, బీఎస్‌పీ, తృణమూల్ పార్టీలు బ్లాక్‌డేకు మద్దతు తెలిపాయి.

## మాజీ మంత్రిపై
# కేసు ఎత్తివేయాలి

కరీంనగర్: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత శ్రీధర్‌బాబును కావాలనే గంజాయి కేసులో ఇరికించారని ప్రజా సంఘాల ఐకాస రాష్ట్ర ఛైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. కరీంనగర్‌లో రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తెరాస కార్యకర్త గంజాయి తెచ్చి శ్రీధర్‌బాబుకు ఫోను చేయడం ఏమిటిని ఆయన ప్రశ్నించారు. ఇందులో ఎమ్మెల్యే, ఇతర నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. ఇది కుట్రపూరితంగా జరిగిందన్నారు. ఈ విషయంపై డీజీపీ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేసును వెంటనే ఎత్తివేయకుంటే.. ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుద్దాల లక్ష్మణ్, కార్యదర్శి లంకదాసరి కనకయ్య, నాయకులు పాల్గొన్నారు.

# పది సెకండ్లలో వేలిముద్రల నివేదిక




హైదరాబాద్ : కేసుల దర్యాప్తులో కీలకమైన వేలిముద్రల (ఫింగర్‌ప్రింట్స్) రిపోర్టు వచ్చేందుకు గతంలో పదిరోజులైనా పట్టేదని, ఇకపై పది సెకండ్లలో లభించనున్నదని డీజీపీ అనురాగ్ శర్మ చెప్పారు. అంతర్జాతీయస్థాయిలో నూతన టెక్నాలజీతో రూపొందించిన ఫింగర్ ప్రింట్ బ్యూరోను హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ విభాగం ఏర్పాటుతో కేసుల దర్యాప్తు, నిందితులను పట్టుకోవడంలో వేగం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టుబడిన నేరగాళ్ల వేలిముద్రలను ఈ బ్యూరోలో నమోదుచేసినట్టు చెప్పారు. వేలిముద్రల సేకరణ, పరీక్షలు, రిపోర్టువంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా 150 మంది పోలీసులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్డన్‌సెర్చ్ వంటి సమయంలో ఫింగర్ ప్రింట్ బ్యూరో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఈ విధానాన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 150 పోలీసు మొబైల్ వాహనాలకు, రాష్ట్రవ్యాప్తంగా మరో 100 పెట్రోలింగ్ వాహనాలకు అనుసంధానం చేసినట్టు అదనపు డీజీపీ గోవింద్‌సింగ్ చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ ఎం మహేందర్‌రెడ్డి, ఐజీలు సౌమ్యామిశ్రా, షిఖాగోయల్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బళ్లారి : నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన జౌళి నీతి పథకాన్ని అమలు చేసింది. దీనిని సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని చేనేత, జౌళి ఉత్తర కర్ణాటక విభాగం సంయుక్త సంచాలకుడు డి.శ్రీధరనాయక్ సూచించారు. చేనేత జౌళి శాఖ ఉత్తర కర్ణాటక విభాగం, జాతీయ శిక్షణ నగరాభివృద్ధి సంస్థ, బళ్లారి నిరుడ్స్ సంస్థ సంయుక్తాధ్వర్యంలో నూతన జౌళి నీతి 2013-2018 గిరిజన పథకం కింద ఐదు రోజులు ఉద్యమశీలత అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన చేనేత, జౌళి శాఖ కింద దళిత, గిరిజన వర్గాలకు సహాయం చేస్తున్నట్లు వివరించారు. గార్మెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి హీరాలాల్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతి, యువకులు బృందాలుగా ఏర్పడి జీన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శంకరరావు, జ్యోతి, విజయలక్ష్మి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# కొండ చిలువను ఆదుకున్న అటవీ సిబ్బంది

భువనేశ్వర్ : కేంద్రపడా జిల్లా బంకువల గ్రామంలో అటవీ సిబ్బంది అడుగుల కొండచిలువను ఆదుకున్నారు. ఆదుకున్న కొండచిలువను బితర్‌కనికా అడవిలోకి విడిచిపెట్టారు. బితర్‌కనికా జాతీయ ఉద్యానవనం ప్రాంతంలో వేలాది సంఖ్యలో కొండ చిలువలు ఉంటాయి. అప్పుడప్పుడూ ఈ ప్రాణులు ఆహారం కోసం అటవి చుట్టుపక్కల గ్రామాల్లో చొరబడి మేకలు, గొర్రెలు, లేగ దూడలు, బాతులు, కోళ్లను మింగేస్తాయని అటవీ సిబ్బంది తెలిపారు. అదే విధంగా వచ్చిన ఈ కొండచిలువును తిరిగి అడవిలో విడిచిపెట్టామన్నారు.

# ఆర్కే నగర్ నుంచి పోటీ చేస్తా

## టి.టి.వి. దినకరన్



చెన్నై : తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నియోజకవర్గమైన ఆర్కే నగర్ నుంచి పోటీ చేస్తానని అంటున్నారు చిన్నమ్మ శశికళ మేనల్లుడు టి.టి.వి. దినకరన్. ఈ ఏడాది ఆఖరిలోనే ఆర్కే నగర్ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించింది.

హిమాచల్ ప్రదేశ్‌లో సాధారణ ఎన్నికల గడువు వివరాలు ప్రకటించే సమయంలోనే ఎన్నికల సంఘం ఆర్కే నగర్ ఉపఎన్నికల విషయాన్ని కూడా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో దినకరన్ కూడా పోటీ చేస్తానని అంటున్నారు. కానీ పార్టీ తరపు నుంచి ఎవరు పోటీ చేయాలన్నది పార్టీ జనరల్ సెక్రటరీగా వి.కె. శశికళ నిర్ణయిస్తారని ఆయన తెలిపారు.

మరోపక్క ఆర్కే నగర్ నుంచి పోటీ చేయడానికి జయలలిత మేనకోడలు దీపా జయకుమార్ కూడా సిద్ధంగా ఉన్నారు. జయలలిత మరణానంతరం తమిళనాడు రాజకీయాల్లో ఎన్నో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆమె చనిపోయిన తర్వాత ఆర్కేనగర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అక్కడ ఓట్ల కోసం నగదు చెల్లించినట్లు చివరి నిమిషంలో తేలడంతో ఉప ఎన్నికను తాత్కాలికంగా నిలిపివేసింది.

**మొదటి పేజీ తరువాయి**

## విప్లవాత్మకంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించే విధంగా చట్టాన్ని రూపొందించాలని సూచించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. తండాలను పంచాయతీలు చేయాలనే దానిపై చర్చించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం సూచించారు. దీనితోపాటు సర్పంచ్‌లకు మరికొన్ని బాధ్యతలు అప్పగించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసినవారిపైన, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పరిపాలనారంగంలో విశేష అనుభవం గడించిన అధికారులు, న్యాయ కోవిదులతో సంప్రదించి కొత్త చట్టానికి రూపకల్పన చేసే అధికారాన్ని మంత్రివర్గం ముఖ్యమంత్రికి అప్పగించింది. గిరిజన తండాలను, కోయగూడేలను, గోండు గూడేలను , చెంచు పల్లెలను గ్రామ పంచాయతీలుగా మార్చాలని, ప్రధాన గ్రామానికి దూరంగా ఉన్న పల్లెలను, శివారు గూడేలను కూడా ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చాలని మంత్రివర్గం నిర్ణయించింది. కొత్త చట్టంతో గ్రామపంచాయతీలకు నిధులతోపాటు వారు నిర్వహించే విధుల విషయంలో కూడా స్పష్టత వస్తుందని సీఎం ప్రతిపాదించారు. విధులను సక్రమంగా నిర్వర్తించని పంచాయితీలపై చర్యలు తీసుకునే అధికారం కూడా ప్రభుత్వానికి ఉండేలా చట్టంలో నిబంధనలు పొందుపరిచి, అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని అన్నారు. దీనికి మంత్రివర్గ సభ్యులు ఆమోదించారు.

**పలు ఆర్డినెన్సులకు ఆమోదం**

సమావేశం ప్రారంభమైన తర్వాత మొదట ఇటీవల ప్రభుత్వం జారీచేసిన పలు ఆర్డినెన్సులకు, శాసనసభలో ప్రవేశపెట్టనున్న బిల్లులకు, కొత్త పోస్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశంలో తొలుత బిల్లులు, ఆర్డినెన్స్‌లపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రెండు మంత్రివర్గ ఉపసంఘాలను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సారథ్యంలో ఒక ఉపసంఘాన్ని, వ్యవసాయ అధికారుల సేవలను సమర్థంగా వినియోగించుకోవడం, రైతు సమన్వయ సమితుల ద్వారా గిట్టుబాటు ధరలను ఏ విధంగా కల్పించాలనే విషయంపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మరో ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 11గంటల వరకు పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడంపై సుదీర్ఘ చర్చ జరిగింది. వ్యక్తిగత కారణాల వల్ల ఈ సమావేశానికి అబ్కారీ మంత్రి పద్మారావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చందూలాల్ హాజరుకాలేదు.

## బొటానికల్ గార్డెన్ ఎదుట వాకర్ల ఆందోళన

సభ్యులు భరత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే***

***రవీందర్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ ఏడీ***

గార్డెన్‌లో కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడం లేదు. సందర్శకులు కాసేపు సేద తీరేందుకు మూడు తాత్కాలిక కాటేజ్‌లను నిర్మిస్తున్నాం. పిల్లలకు పర్యావరణ విజ్ఞాన కేంద్రం, యోగా కేంద్రం నిర్మిస్తున్నాం. ఎక్కడా చెట్లను నరకలేదు. అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగానే పర్యావరణహితంగానే పనులు జరుగుతున్నాయి. ఇకో టూరిజంలో భాగంగానే పనులు చేపట్టాం. వాకర్స్ అసోసియేషన్ వారి ఆరోపణల్లో నిజం లేదు.

## జీఎస్‌టీ రిటర్న్‌లపై జరిమానా రద్దు

51.37లక్షలు, సెప్టెంబర్ నెలకుగానూ 42లక్షలకు పైగా రిటర్న్‌లు దాఖలయ్యాయి. జులైలో వచ్చిన వాటిలో కేవలం 33.98లక్షలు మాత్రమే గడువులోగా దాఖలయ్యాయి. ఆగస్టు నెలలో కూడా 28.46లక్షల రిటర్న్‌లు మాత్రమే గడువులోగా వచ్చాయి. ఒక నెల జీఎస్‌టీ రిటర్న్‌లను ఆ తర్వాత నెల 20వ తేదీలోగా దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత దాఖలు చేసే వారు కేంద్రం విధించే జీఎస్‌టీపై రోజుకు రూ.100, రాష్ట్రం విధించే జీఎస్‌టీపై రోజుకు రూ.100 చొప్పున జరిమానా కట్టాల్సి ఉంటుంది.

## 7 లక్షల కోట్లతో హైవేల అభివృద్ధి

మేర కొత్త హైవేలను నిర్మిస్తామని ఈ మధ్యే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించిన విషయం తెలిసిందే. వచ్చే ఐదేళ్లలో ఈ భారత్‌మాల ప్రాజెక్ట్‌తోపాటు 80 వేల కిలోమీటర్ల హైవేల అభివృద్ధికి రూ.7 లక్షల మేర ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. భారత్‌మాల ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే డీపీఆర్‌లు కూడా సిద్ధం చేస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. ఎన్‌హెచ్‌డీపీ ప్రాజెక్ట్‌లో భాగంగా గతంలో 50 వేల కిలోమీటర్ల హైవేల నిర్మాణం జరగగా.. ఇప్పుడు భారత్‌మాల పేరుతో రెండో అతిపెద్ద హైవే నిర్మాణ ప్రాజెక్ట్‌కు కేంద్రం శ్రీకారం చుట్టబోతున్నది. సరకు రవాణా కోసం ఉద్దేశించిన ఎకనమిక్ కారిడార్‌ల అభివృద్ధి కూడా ఈ హైవేల ప్రాజెక్ట్ కిందికే వస్తుందని సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. 21 వేల కిలోమీటర్ల మేర ఎకనమిక్ కారిడార్లను నిర్మించాలని గతంలో కేంద్రం నిర్ణయించింది. ముంబై-కొచ్చి-కన్యాకుమారి, బెంగళూరు-మంగళూరు, హైదరాబాద్-పనజీ, సంబల్‌పూర్-రాంచీ కారిడార్లు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. భారత్‌మాల ప్రాజెక్ట్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 44 ఎకనమిక్ కారిడార్లను గుర్తించారు.

# రేవంత్ వ్యాఖ్యలు బాధించాయి : పయ్యావుల



అమరావతి : తెలంగాణ తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధించాయని ఆ పార్టీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత పయ్యావుల కేశవ్ అన్నారు. మీడియాతో పయ్యావుల కేశవ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రేవంత్ వ్యాఖ్యలపై స్పందించాలా? లేదా? అని సందిగ్ధంలో పడ్డానని.. అయితే జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. చంద్రబాబును రేవంత్‌రెడ్డి కలిశాక స్పందించాలని అనుకున్నాని చెప్పారు. వ్యక్తిగతంగానే స్పందిస్తున్నాని తెలిపారు.

25 ఏళ్లుగా పార్టీలో సైనికుడిలా పనిచేస్తున్నాని పయ్యావుల చెప్పారు. చంద్రబాబు ప్రోత్సాహం వల్లే తాను, రేవంత్ ఈ స్థాయికి ఎదిగామన్నారు. తనకంటే రేవంత్‌ను చంద్రబాబు ఎక్కువగా ప్రోత్సహించారని చెప్పారు. ఆరు నెలలుగా రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై తన వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని తెలిపారు. ఆయన చంద్రబాబును కలిశాకే ఆ వివరాలపై స్పందిస్తానని అన్నారు. రేవంత్‌కు వ్యక్తిగత అజెండాలే ప్రధానమని ఆరోపించారు. ఆయన జైలుకు వెళ్తే మొదట స్పందించిన వ్యక్తిని తానేనని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి బాసటగా నిలిచానన్నారు

కేసీఆర్ ప్రభుత్వంతో తనకు లంకె పెట్టడం దుర్మార్గమని పయ్యావుల మండిపడ్డారు. రేవంత్ వ్యాఖ్యల వల్ల తనకంటే ఆయనకే ఎక్కువ నష్టమని పేర్కొన్నారు. తనకు, ఏపీ మంత్రి సునీతకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవని స్పష్టం చేశారు. తెలంగాణలో తనకు ఒక్క రూపాయి వ్యాపారం లేదని.. హైదరాబాద్‌లో ఒక్క ప్లాటు కూడా లేదని పేర్కొన్నారు. లేని నా వ్యాపారాలపై మాట్లాడే ముందు రేవంత్ తన వ్యాపారాల గురించి మాట్లాడాల్ని కోరారు. కేసీఆర్ కుమార్తె కవితతో కలిసి కంపెనీ రిజిస్టర్ చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జగన్‌తో రేవంత్ అంటకాగింది వాస్తవం కాదా? అని అడిగారు. పార్టీ అధ్యక్షుడిని కలిశాకే ఆ వివరాలన్నీ వెల్లడిస్తానని కేశవ్ తెలిపారు.

# ఘనంగా జానుమద్ది హనుమశ్చాస్త్రి జయంతి

## తెలుగు వెలుగుకు ప్రతి ఇంటా గ్రంథాలయం

### మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ



కడప : తెలుగుభాషను బతికించుకోవాలంటే ప్రతి ఇంటా గ్రంథాలయం ఉండాలని.. పుస్తక పఠనం నేటి యువతరానికి వ్యసనంగా మారాలని మహారాష్ట్ర అదనపు డీజీపీ వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ సూచన చేశారు. తెలుగు సాహిత్యానికి ఎంతో మంది మహానుభావులు ఎనలేని సేవలందించారని అందులో సీపీబ్రౌన్ సేవలు అనన్య సామాన్యమన్నారు. అదే పంథాను అనుసరిస్తూ జిల్లాలో తెలుగుభాషకు జీవం పోసిన మహనీయుడు జానుమద్ది హనుమశ్చాస్త్రి అని కొనియాడారు.

నగరంలోని సీపీబ్రౌన్ గ్రంథాలయంలో జానుమద్ది హనుమశ్చాస్త్రీ 93వ జయంతి, జానుమద్ది సాహితీపీఠం గ్రంథాలయ పురస్కార సభ కురాడి చంద్రశేఖర్ కల్కూరా అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సినిమా, వాట్సప్, ఫేస్‌బుక్ వంటి వాటిని దూరంగా ఉంచితేనే ఇది సాధ్యమవుతుందన్నారు. బ్రౌన్, శాస్త్రీ ఇద్దరు భాషకు ప్రాణం పోశారని అనేక జన్మల పుణ్యం చేసుకుంటేనే తెలుగు ప్రజలుగా జన్మిస్తారని ఆ జన్మను సార్థకం చేసుకునేందుకు తెలుగు భాషకు సేవలందించాలని ఆయన కోరారు. యోవేవి ఉపకులపతి అత్తిపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. బ్రౌన్ గ్రంథాలయాన్ని వచ్చే ఆరు నెలల్లో రూపురేఖలు మారుస్తామని కొత్తబట్టలతో అలంకరిస్తామని, వేదికను విస్తరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కడప జిల్లా తెలుగు కవులు, రచయితలు, కళాకారులకు పుట్టినిల్లని అందుకోసం కడప గ్రంథాలయన్ని ఏడాదిన్నర కాలంలో డిజిటలైజేషన్ చేసి ప్రతి ఒక్కరికీ ఈ గ్రంథాల గురించి తెలియజేసేలా చూస్తామని భరోసా ఇచ్చారు. హనుమశ్చాస్త్రి గ్రంథాలయాలయానికి చేసిన సేవ చిరస్మరణీయమన్నారు. శిథిలావస్థలో ఉన్న కడప గ్రంథాలయాన్ని మహాసముద్రంగా మార్పు చేయడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమని మీకు మనసున్నంత వరకు గ్రంథాలయాలకు ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. గాడిచర్ల ఫౌండేషన్ నిర్వాహకులు కురాడి చంద్రశేఖర్ కల్కూరా మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్‌కు స్ఫూర్తి ప్రదాత జానుమద్దేనన్నారు. కుటుంబ స్వలాభాన్ని లెక్కచేయకుండా కేవలం సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం గ్రంథాలయం తప్ప మరే ఆలోచనలేని వ్యక్తి శాస్త్రి అని శ్లాఘించారు. అంతకు ముందు జానుమద్ది హనుమశ్చాస్త్రీ తనయుడు విజయభాస్కర్ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం అతిథులను ఆహ్వానితులు పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించగా, లక్ష్మీనారాయణను నగరానికి చెందిన ప్రముఖులు, వివిధ పార్టీల ప్రతినిధులు, స్థానికులు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సాహితీ వేత్తలు, తెలుగుభాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భాజపా తీరుపై నిరసన

సేలం : మెర్సల్ చిత్రంలో జీఎస్టీ విధానంపై నటుడు విజయ్ పలికిన సంభాషణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్న భాజపా తీరుపై సేలంలో నిరసన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ, విజయ్ అభిమానుల సంఘం సంయుక్తంగా ఆదివారం ధర్నా చేపట్టాయి. కొత్త బస్టాండు సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ నేతృత్వం వహించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ... నీట్, రైతులు, జల్లికట్టు వంటి అంశాలకు సంబంధించి పట్టించుకోని భాజపా ఈ చిత్రంపై స్పందించడాన్ని తప్పుబట్టారు. ఆందోళనతో స్థానికంగా వాహన రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది. పల్లంపట్టి పోలీసులు వచ్చి నిరసనకారులను అడ్డుకున్నారు. కార్యక్రమానికి అనుమతి పొందకుండా నిర్వహించిన కారణంగా 12 మందిపై కేసు నమోదు చేశారు.

# సర్వరోగ నివారణి యోగా

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్




కడప : యోగా అన్ని రోగాలను నయం చేస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. కడప జడ్పీ సమావేశ మందిరంలో రాత్రి ధ్యాన.. వైద్య.. యోగపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు రఘు గురూజీ ధ్యాన.. వైద్య.. యోగా గురించి వివరించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలియచేశారు. అన్ని సమస్యలకు యోగా ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నారు. 24 సంవత్సరాల నుంచి నాలుగు రాష్ట్రాల్లో ఎనిమిది లక్షల మందికి పైగా యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. నేటి పిల్లలపై సినిమా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. ప్రతిరోజు అనే ఒత్తిళ్ల నడుమ జీవించాల్సి వస్తుందన్నారు. కావున ప్రతిరోజు ఉదయం గంట పాటు యోగా చేస్తే ఆ రోజు మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలకు యోగా నేర్పించాలన్నారు. యోగా చేస్తే ఎలాంటి జబ్బులు దరి చేరవన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, చక్కెర వ్యాధి, ఆస్తమాలతో పాటు పలు జబ్బులు నయమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆనంద్, డిప్యూటీ సీఈవోతో పాటు పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఏదీ

## - నరసింహారెడ్డి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని ఎస్టీయూ సహాధ్యక్షుడు నరసింహారెడ్డి విమర్శించారు. పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఎస్టీయూ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో బాలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.... పాఠశాలకు నాసిరకమైన బయోమెట్రిక్ యంత్రాలను ఇచ్చారని తెలిపారు. గ్రామాల్లో సాంకేతిక సమస్యల వలన ఇవి సరిగా పనిచేయడం లేదని విమర్శించారు. వీటి వినియోగం ఉపాధ్యాయుల జీతాలతో లంకె పెట్టడం సరికాదన్నారు. ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు పెరిగాయని, పాఠశాలకు వచ్చినప్పటి నుంచి నివేదికలు పెట్టుకోవడానికి సమయం సరిపోతోందన్నారు. వీరు బోధనపై దృష్టిపెట్టేలా బాధ్యతలు కుదించాలని కోరారు. రూ. 398కే పనిచేసిన ప్రత్యేక ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని తెలిపారు.

# రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు

**ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడుపు ప్రభాకర్‌రెడ్డి**

**నవంబరు 1న ఛలో దిల్లీ**



ఆదిలాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పట్టించుకోక పోవడంతోనే దేశంలో అర నిమిషానికి ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపిం చారు. జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పోరేటర్లు, వ్యాపారవేత్తలకు వత్తాసు పలికి కొన్ని కోట్ల రూపాయలు వారికి ధారాదత్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో పత్తికి గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతులు గళం విప్పితే నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విషయంలో భాజపాకి చిత్తశుద్ధి లేదన్నారు. కమీషన్లు వచ్చే పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని దివాలా తీస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిలో తెలంగాణ ముఖ్యమంత్రి అగ్రస్థానంలో ఉన్నారని చెప్పుకొంటున్న తెరాస ప్రభుత్వం అసలు అప్పుల్లో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని తెలిపారు. రైతుల సమస్యలు, డిమాండ్ల సాధనకు నవంబరు 1న చలో దిల్లీ కార్యక్రమంలో జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని, జిల్లాలోని రైతులు ఈ మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో ఏఐకేఎస్ నాయకులు బత్తుల గంగారెడ్డి, ఎస్.కె.పాషా, సిసలే దీపక్, బుర్రి సట్వాజీ, కొండ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ : జిల్లాలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.లింగయ్య తెలిపారు. ఇందుకు నవంబర్ 25వ తేదీలోగా అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌వీఎస్ హెచ్‌జీ.ఓఆర్‌జీ, డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.జేఎన్‌వీ ఆదిలాబాద్.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ప్రధానోపాధ్యాయులతో పూర్తిచేయాలని వివరించారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థిఫొటో, సంరక్షకుల సంతకం, ఓటీపీ కోసం మొబైల్‌ఫోన్‌లతో సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లాలని వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి 15తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అంతర్జాలంతో పాటు నేరుగా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. ఇతర వివరాలకు 08738- 238021, 94412 64035 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### కార్మికుల హక్కులు హరిస్తున్న

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధ్వజం

-నవంబరు 9 నుంచి దిల్లీలో మహాధర్నా

ఆదిలాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, వారి న్యాయమైన హక్కులను హరించి రోడ్డున పడేస్తున్నారని ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉజ్జయిని రత్నాకర్ రావు, వంగూరి రాములు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అచ్చేదిన్, మేక్ ఇన్ ఇండియా, ఏటా కోటి 20లక్షల ఉద్యోగాలు వంటి నినాదా లతో కేంద్రంలో భాజపా 2014లో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ మూడేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. సమాచార వ్యవస్థ పటిష్టతకు భారత సంచార్ నిగమ్ లిమిటెడ్‌లో కీలక భాగాలైన 65వేల సెల్ టవర్లను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టి సిబ్బంది, కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తోందని చెప్పారు. విదేశీ పెట్టుబడిదార్లను ఆహ్వానించి దాదాపు 5కోట్ల మంది ఉపాధికి హాని తలపెట్టిందని పేర్కొన్నారు. ఎన్నో ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కార్మిక వర్గం ప్రస్తుతం తీవ్ర కష్టాల్లో ఉందన్నారు. టీఎస్‌ఐపాస్ పేరిట పెట్టుబడిదారులకు ప్రభుత్వ భూములు చౌకగా కట్టబెట్టి రాయితీలు కల్పిస్తోందని, లక్షలాది ఒప్పంద కార్మికులకు జీతాలు పెంచకుండా కాలయాపన చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో మూసి ఉన్న పరిశ్రమలు పునరుద్ధరించడంలో విఫలమైందన్నారు. నవంబరు 9, 10, 11 తేదీల్లో దిల్లీలో మూడ్రోజుల మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నాలో రాష్ట్రంలోని కార్మిక వర్గం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు రాంలక్ష్మణ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు, జిల్లా కార్యదర్శి కుంటాల రాములు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మల్లేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మర్గం వెంకటనారాయణ, ఎన్ఎఫ్‌టీఈ బీఎస్‌ఎన్‌ఎల్ జిల్లా కార్యదర్శి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రధాన కాలువను పరిశీలించిన ఎన్నెస్పీ అధికారులు



ఖమ్మం : నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాలువకు నీటి విడుదల చేసే అవకాశాలున్నందున ప్రధాన కాలువను అధికారులు నల్గొండ జిల్లాలో పరిశీలించారు. సాగర్ ఎడమ ప్రధాన కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఖమ్మంలోని ఎన్నెస్పీ మానిటరింగ్ డివిజన్ పరిధిలో ఉంటుంది. ఎడమ ప్రధాన కాలువ నిర్వహణ బాధ్యతలు ఖమ్మంలోని మానిటరింగ్ డివిజన్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఇందులో భాగంగా ఖమ్మం ఎన్నెస్పీ సర్కిల్ ఎస్ఈ సాయిబాబ, ఖమ్మం మానిటరింగ్ డివిజన్ ఈఈ మంగళంపుడి వెంకటేశ్వర్లు, మిర్యాలగూడెం డీఈఈ సంపత్ ఇతర అధికారులు సాగర్ ప్రధాన కాలువను పరిశీలించారు. హాలియా, త్రిపురారం, మిర్యాలగూడెం, తడికమళ్ల, అన్నారం, మునగాల ప్రాంతాల్లో సాగర్ ఎడమ ప్రధాన కాలువను, దేవులపల్లి రిజర్వాయర్‌ను, ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న బ్రాంచి కాలువలు, మేజర్ కాలువల తూములు, షట్టర్లు తనిఖీ చేశారు. కాలువ లోపలి భాగంలో జరుగుతున్న ఆధునికీకరణ, మరమ్మతులను త్వరగా ముగించాలని, డిసెంబరు ఒకటి నాటికి పనులు పూర్తిగా నిలిపేయాలని సూచించారు. మిషన్ భగీరథ పథకంలో పలు ప్రాంతాల్లో సాగర్ కాలువను క్రాస్‌చేస్తూ పైప్‌లైన్‌ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ పనులను సైతం కాలువ ప్రదేశాల్లో త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 573 అడుగుల మేరకు నీరు చేరింది. 263 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. దీంతో ప్రస్తుతం ఆయకట్టులో నిలిచిఉన్న పంటలను కాపాడేందుకు ముందస్తుగా డిసెంబరు ఒకటి తేదీ కంటే ముందుగానే ప్రధాన కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.

కాలువలో అడ్డుకట్టలు తొలగించాలని, తూములకు షట్టర్లు బిగించాలని, క్రాస్ రెగ్యులేటర్ల పనితీరును పరీక్షించుకోవాలని, మెకానికల్ వర్క్స్ ఉంటే వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

## మారుమూల ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం: ఎంపీ



నేరడిగొండ : మారుమూల ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ అన్నారు. నాగమల్యాల్ గ్రామవాగుపై వంతెన నిర్మాణానికి ఆయన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని నాగమల్యాలతోపాటు, పీచర, గోవింద్‌పూర్, తిమ్మాపూర్, గ్రామ స్థులు వర్షకాలం వచ్చిందంటే, తేలికపాటి వర్షం కురిసిన ఈ గ్రామాలప్రజలు రాకపోకలకు ఇబ్బందు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు తనదృష్టికి తీసుకొచ్చారన్నారు. తెరాస ప్రభుత్వం ఏర్పడ్డాక పల్లెపల్లెకు రహదారుల నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు.

ఈ వంతెనను రూ.4.60 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించ నున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామానికి రహదారి నిర్మిస్తామన్నారు. వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తి చేయాలని డీఈ ఆనంద్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ఆడె శీల, బోఇఔ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు దావుల బోజన్న, తెరాస జిల్లా ఉపాధ్యక్షుడు జి వెంకటరమణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు టీ రాజు, తెరాస మండల అధ్యక్షుడు రాథోడ్ కమల్‌సింగ్, మండల రైతు సమన్వయ కమిటీ సహాయకర్త గడ్డం భీంరెడ్డి, కుమారి పీఏసిఎస్ అధ్యక్షుడు శివారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రాజేశ్వర్, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపిటీసి సభ్యులు, తెరాస నాయకులు పాల్గొన్నారు.

### పథకాలను ప్రజల వద్దకు

## సమర్థంగా తీసుకెళ్లాలి

పాలమూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు సమర్థవంతంగా తీసుక వెళ్లాలని డీఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి ఉద్యోగులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీఆర్‌డీవోగా వస్తున్న ఆనంద్‌కుమార్‌ను ఆయన ఉద్యోగులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. కాని కొన్ని పథకాలు రాష్ట్ర స్థాయిలో మన జిల్లాలోనే తక్కువగా అమలు అవుతున్నాయని తెలిపారు. వాటిలో వృద్ధి సాధించడానికి కృషి చేయాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర వాటిలో పురోగతి సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం రిలీవ్ కానున్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ, డ్వామా కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డీఆర్‌డీవోగా ఆనంద్‌కుమార్ : డీఆర్‌డీవో జగదీశ్వర్ రెడ్డి మిర్యాలగూడ ఆర్డీవోగా వెళ్తుండడంతో ఆయన స్థానంలో జిల్లా భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ ఆనంద్‌కుమార్‌కు కలెక్టర్ రొనాల్డ్‌రోస్ ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు.

## నగదు బదిలీ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి



మహబూబ్‌నగర్ : ప్రజా పంపిణీ విధానంలో మరింత పారదర్శకంగా తమ సేవలు వాడుకునే దిశగా ఆలోచించి చౌకధర దుకాణ డీలర్లకు న్యాయం చేయాలని చౌకధర దుకాణదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ యాదవ్ ప్రభుతాన్ని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు బదిలీ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.వెంకటేశ్వర్లుకు జిల్లా చౌకధర దుకాణాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18వేల మంది రేషన్ డీలర్ల పొట్టకొట్టే నగదు బదిలీ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. నలభై ఏళ్లుగా నామమాత్రపు కమీషన్‌తో దుకాణాలను డీలర్లు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏనాటికైనా తమ సమస్యల పరిష్కారంతో పాటు ప్రత్యేక గుర్తింపునిస్తుందనే ఆశతో ఉన్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేషన్ డీలర్ల సమస్యలను నేరుగా తెలుసుకునే విధంగా మా ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పించాలని మూడేళ్లుగా కోరుతున్నా.. అవకాశం కల్పించడం లేదన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో దశల్లో పారదర్శకత పెరిగిన తరుణంలో రేషన్ డీలర్ల వ్యవస్థను కొనసాగిస్తూనే కమీషన్ల స్థానంలో కనీస గౌరవ వేతనం చెల్లించాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా చౌకధర దుకాణాదారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేష్, కోశాధికారి జానకి రాములు, జమాలుద్దీన్, ఆనంద్‌గౌడ్, చంద్రశేఖర్, భీంరెడ్డి, వినోద్, లక్ష్మీరెడ్డి, రఘు, హన్మిరెడ్డి, వెంకటరమణ, పాండునాయక్, అశోక్, నారాయణ, శ్రీనివాసులు, దేవుజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు సంతృప్తికరమైన సేవలందించడమే లక్ష్యం

ఖమ్మం : రోగులకు సంతృప్తికరమైన వైద్య సేవలందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతుందని జిల్లా పాలనాధికారి లోకేశ్‌కుమార్ అన్నారు. అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల అమలు, సదుపాయాలపై ప్రత్యేక పరిశీలన జరుపుతున్నట్లు వెల్లడించారు. ఖమ్మం టీటీడీసీ భవనంలో రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో 14 ప్రతేక బృందాలు సోమవారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపాయని చెప్పారు. నిర్దేశించిన చెక్‌లిస్ట్ ప్రకారం పరిస్థితులను అంచనా వేయడం జరిగిందన్నారు. లోపాలను గ్రహించి నివేదికలు రూపొందించారని తెలిపారు. సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. రికార్డుల నమోదు, నిధులు, మందులు, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ, ఆసుపత్రి భవనాల పరిస్థితి, జేఎస్‌వై, కేసీఆర్ కిట్, జెఎస్‌ఎస్‌కె తదితర పథకాల అమలు తీరుపై పరిశీలన జరిపిన ప్రత్యేక బృందాలు కలెక్టర్‌తో చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు అమలవుతున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న లోటుపాట్లను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. నివేదికల్లో వివరాలను పొందుపరిచి కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండల్‌రావు, పెద్దాసుపత్రి సూపరిం టెండెంట్ మదన్‌సింగ్, రాష్ట్ర ప్రతినిధి బృందం సుబ్బలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, పద్మజ, జాన్‌బాయి, సుకృతారెడ్డి, మోతిలాల్, సంయుక్త సంచాలకులు డాక్టర్ స్వర్ణకుమారి, ప్రవీణ, రాధారెడ్డి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా జోన్‌ల ఏర్పాటు



వీరన్నపేట: జిల్లాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా జోన్‌లను ఏర్పాటు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ టీఎన్జీవో భవనంలో జోన్‌ల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీఎన్జీవోల జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, అధ్యక్షులు రామకృష్ణరావు, కోశాధికారి శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చంద్రనాయక్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, బక్క శ్రీనివాస్, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి కిష్టయ్య, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రఘురామ్‌రెడ్డి, టీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణ, పింఛనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలుగౌడ్, బాలకిషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హీరం తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు గతంలో నల్గొండ జిల్లా జోన్‌లో ఏర్పాటు చేయడం కారణంగా తీవ్రంగా నష్టం జరిగిందని చెప్పారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబగద్వాల, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలతో జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫలితంగా జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. చదువు ఆధారంగా కాకుండా వారి తండ్రి, తాతల స్థిర నివాసం ఆధారంగా స్థానికతను నిర్ధరించాలని సూచించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగుల స్థానికత ఆధారంగా వెంటనే బదిలీలను చేపట్టాలన్నారు. జిల్లాలు ఏర్పడిన తరవాత ఉద్యోగులకు పని భారం పెరగడంతోపాటు అధికారుల పర్యవేక్షణ బాగా పెరిగిందని చెప్పారు.

## 31న పరుగు పోటీలు

మెదక్ : దిల్లీకి చెందిన నేషనల్ యువ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో గేల్ స్పీడ్ స్టార్ సీజన్-3కి సంబంధించిన గోడ పత్రికను పురపాలిక అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు బాపురెడ్డి మాట్లాడుతూ... ఈనెల 31న కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో పరుగుపందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 నుంచి 14, 15 నుంచి 17 ఏళ్ల యువతీ యువ కులు పోటీలో పాల్గొనాలని సూచించారు. 100, 200, 400 మీటర్ల విభాగంలో పరుగుపందెం పోటీలు ఉంటాయని, ఇందులో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి, అక్కడ ప్రతిభ చూపినవారు దిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి పీటీ ఉషా అకాడమీలో ఉచితంగా శిక్షణ ఇచ్చి 2020, 2024 ఒలింపిక్స్‌కు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాయ మల్లేశం, మెదక్ జిల్లా ప్రతినిధి భవానిశంకర్, బాధ్యులు బాలకిషన్, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టీఆర్‌టీకి అనుమతించాలి

నల్గొండ : టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించిన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ రాసేందుకు 2015-17 బ్యాచ్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) ట్రైనీ అభ్యర్థులకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ పలువురు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. డీఈఎల్‌ఈడీ రెండో సంవత్సరం చివరి దశలో ఉన్నామని, 40 రోజుల ఇంటర్న్‌షిప్ పూర్తిచేశామని చెప్పారు. ప్రథమ సంవత్సరం కౌన్సెలింగ్ ఆలస్యంగా నిర్వహించారని చెప్పారు.

## పెరుగుతున్న మధుమేహ ముప్పు

పటాన్‌చెరు: మధుమేహం కబళించేస్తోందని ఉస్మానియా వైద్యకళాశాల ఎండోక్రైనాలజీ విభాగాధిపతి రాకేష్‌కుమార్ సహాయ్ అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం విశ్వవిద్యాలయంలో బిగ్ డేటా అప్లికేషన్స్ ఇన్ డ్రగ్ రీపర్పసింగ్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రోగాలు పెరుగుతున్నాయని అన్నారు. విశ్వ వ్యాప్తంగా ప్రతి ఏడు సెకన్లకు మధుమేహ వ్యాధితో ఒకరు మృత్యువాత పడుతున్నారని అన్నారు. అంతర్జాతీయంగా 41.5 కోట్ల మంది వ్యాధి బారిన పడ్డారని అన్నారు. 2040 నాటికి 64.2 కోట్ల మందికి వ్యాపించే అవకాశాలు ఉన్నట్టు అంచనాలు వేస్తున్నారని వివరించారు. ప్రతి 11 మంది పెద్దల్లో ఒకరికి వ్యాధి ఉందని అన్నారు. ప్రతి 10మందిలో ఒకరికి సోకే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబీకులే ఎక్కువగా ఈ వ్యాధిన పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వ్లాదిమిర్ పారొమికోవ్, ద్రుజిలోవ్‌విస్కీ దిమిత్రీ, నరహరిశాస్త్రి, రాంబాబు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ప్రగతిబాటకు దిక్సూచి జౌళి పార్క్

చరిత్రాత్మకమైన వరంగల్- హనుమకొండ సమీపంలో శాయంపేట గ్రామ పరిధిలో వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన జౌళి పార్క్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన ఘట్టం తెలంగాణ ప్రగతి బాటకు మరో దిక్సూచిగా నిలుస్తుంది. ఒకప్పుడు అజంజాహీ మిల్లు వరంగల్‌కు గర్వకారణంగా ఉండేది. వేలాదిమందికి ఉపాధి కల్పించేది. పరాయి పాలన చీకట్లు కమ్ముకొనకపోతే, అజంజాహీ మిల్లు పునాదిగా ఈ ప్రాంతం వస్త్ర పరిశ్రమతో కళకళలాడేది. కానీ వలస పాలకుల దుర్నీతి కారణంగా ప్రఖ్యాతిగాంచిన అజంజాహీ మిల్లు మూతపడి తెలంగాణ బిడ్డలు సూరత్, షోలాపూర్, భీవండిలకు వలసవెళ్ళారు. తెలంగాణ వస్తే మళ్ళా తమ గడ్డకు చేరుకుంటామని ముడుపు కట్టుకొని ఎదురుచూస్తున్నారు. వలస కార్మికుల స్వప్నం నెరవేర్చడానికి ముఖ్యమంత్రి దృఢదీక్షతో ప్రపంచ వస్త్ర పరిశ్రమ రంగంలోనే మణిమకుటం వంటి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు రూపకల్పన చేయడం హర్షణీయం. నూలుపోగు మొదలుకొని సిద్ధదుస్తుల వరకు సమస్త వస్త్ర సామాగ్రికి ఈ కాకతీయ జౌళి పార్క్ నిలయం కాబోతున్నదని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బృహత్‌ప్రణాళికలను బట్టి స్పష్టమవుతున్నది. కాకతీయ జౌళిపార్క్ శంకుస్థాపన వలస పాలకుల మాదిరిగా హడావుడిగా చేసినది కాదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇక్కడ వస్త్రనగరిని నిర్మించడానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. అన్ని హంగులూ పూర్తి చేసుకుంటున్న క్రమంలోనే ఈ శంకుస్థాపన జరిగిం ది. అతివేగంగా ఉత్పత్తి ప్రారంభించడానికి సన్నాహాలు సాగుతున్నాయి. శంకుస్థాపన రోజే 22 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం ఇందుకు ఉదాహరణ. అవిభక్త వరంగల్ జిల్లా, సమీప జిల్లాల్లో పత్తి సాగు ఎక్కువ. కానీ దీన్ని వస్త్ర రూపంలోకి తెచ్చి, రైతులకు లాభం, నేతన్నలకు ఉపాధి కల్పించాలనే ప్రయత్నం ఏనాడూ జరుగలేదు. తెలంగాణ రైతన్నలు పండించిన పత్తి విదేశాల్లో జిగేలుమంటూ సిరులు కురిపిస్తుంటే, ఇక్కడి బిడ్డలు వలస పోవలసి వచ్చింది. ఇప్పుడు తెలంగాణలో వ్యవసాయాన్ని పరిశ్రమలను అనుసంధానం చేసి స్థానికులకు ఉపాధి కల్పించి, రాష్ట్రా న్ని సంపద్వంతం చేసే ప్రయత్నమే ఈ జౌళి పార్కు. వరంగల్ మహానగరం తెలంగాణ జన హృద యం. తెలంగాణ సమాజానికి సాంస్కృతిక రాజధాని. ఈ ప్రాంతం అనేక మంది కవులు, కళాకారులకు విద్యావిజ్ఞాన వేత్తలకు, రాజకీయ దురంధరులకు జన్మనిచ్చింది. కానీ ఈ చరిత్రాత్మక నగరం కూడా వలస పాలకుల వివక్షకు గురి కావడం విషా దం. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ అభివృద్ధికి ఓరుగల్లు ప్రగతి ఇరుసు వంటిదని ముఖ్యమంత్రి గుర్తించారు. అందుకే ఈ చరిత్రాత్మక నగర సర్వతోముఖాభివృద్ధిపై శ్రద్ధ వహించారు. కాకతీ య జౌళి పార్కుతో పాటే ఔటర్ రింగ్‌రోడ్డుకు, కాజీపేట్ సమాంతర వంతెనకు, ఐటీపార్క్ రెండవ దశకు శంకుస్థాపన చేశారు. ఓరుగల్లును వ్యవసాయ, పారిశ్రామిక, విద్యా కేంద్రంగా వృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. కాళేశ్వరం నుంచి నీటి సరఫరా చేసి దూప తీరుస్తామని కూడా చెప్పారు. హైదరాబాద్ నగరం ఆధునిక హంగులను సంతరించుకునే క్రమంలో వలస పాలకులు తగిన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించలేదు. పాలకవర్గానికి చెందిన వారి రియల్ ఎస్టేట్ వ్యాపారం చుట్టూ హైదరాబాద్ నగర అభివృద్ధి అల్లుకుపోవడం తో, ప్రజలు తగిన వసతులు లేక గిలగిలలాడి పోతున్నారు. వాన చుక్కలు పడితే వరదలు ముంచే దుస్థితి ఏర్పడ్డది. అందుకే ముఖ్యమంత్రి హైదరాబాద్ అనుభవాన్ని గుర్తు చేస్తూ, వరంగల్ నగరాన్ని శాస్త్రీయ పద్ధతిలో తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో ఔటర్ రింగ్ రోడ్డు కీలకమైనది. నిజాం కాలం నాడే ఓరుగల్లుకు విమానాశ్రయం ఉన్నది. ఆ తరువాత కాలంలో మూతపడ్డది. ఇప్పుడు మళ్ళా నగరంలో గాలిమోటరు మోత వినబడుతుందనే ఆశ పుడుతున్నది. హైదరాబాద్-వరంగల్ రహదారి పొడుగునా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటవుతున్నది. ఈ నేపథ్యంలో రహదారి పొడుగునా భువనగిరి, జనగామ వంటి పట్టణాలు అభివృద్ధి ఫలాలను పండించవచ్చు. ఆరు దశాబ్దాలకు పైగా పరాయి పాలనలో స్వాభిమానం మాటెత్తని కొందరు నాయకులు ఇప్పుడు తెలంగాణలో సాగుతున్న అభివృద్ధి పనులకు వంకలు పెట్టడం ఆశ్చర్యంగా ఉన్నది. వరంగల్ సమీపంలో జౌళి పార్కు పెడితే మరి మరో చోటికి అన్యాయం జరుగుతుందని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఆయా ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు ఇప్పటికే రూపొంది అమలవుతున్నాయి. యాదాద్రి అభివృద్ధికి చర్యలు తీసుకున్నప్పుడు కొందరు శివాలయాల సంగతేమిటని వంకర మాటలు మాట్లాడారు.

## ఢిల్లీ మార్కెట్‌లో అగ్నిప్రమాదం.. 100 షాపులు బుగ్గి..



న్యూఢిల్లీ: ఢిల్లీలోని కమ్లా మార్కెట్లో అర్ధరాత్రి దాటాక భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు 100 షాపులు మంటల్లో చిక్కుకున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన కమ్లా మార్కెట్‌కు చేరుకుని పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ వీరేంద్ర సింగ్ మాట్లాడుతూ... మూడు చోట్ల మంటలు విపరీతంగా చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు మొత్తం 30 ఫైర్ ఇంజన్లు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చింది. మంటలు రేగకుండా ఇప్పటికీ చర్చబర్చే పనిలో సిబ్బంది ఉన్నారు... అని వెల్లడించారు.

కాగా ఇవాళ ఉదయం పంజాబ్‌లోని లుథియానాలో మరో భవనంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షింగర్ సినిమా థియేటర్ సమీపంలోని నూలు మిల్లులో పెద్దఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మొత్తం 12 ఫైర్ ఇంజన్లతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

## పాములు, సాలీళ్లకు ఎందుకు భయపడతామంటే...



బెర్లిన్: ప్రపంచంలో పాములకు, సాలీళ్లకు ఏమాత్రం భయపడని వారు చాలాకొద్దిమంది మాత్రమే ఉంటారు. మరికొంతమంది కలలో ఇవి కనిపించినా అదిరిపడు తుంటారు. ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై ఇటీవల శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం నిర్వహించి, ఫలితాలు వెల్లడించారు. దీనికి ప్రధాన కారణం వారు చిన్నప్పుడు వీటిని చూసి అమితంగా భయపడి ఉంటారని వెల్లడైంది.

ఈ కారణంగానే వారిలో భయం పెరుగుతూ వస్తున్నదని శాస్త్రవేత్తలు తెలిపారు. జర్మనీకి చెందిన మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ సారథ్యంలో ఈ పరిశోధన జరిగింది. 40 నుంచి 60 మిలియన్ సంవత్సరాలుగా ఇటువంటి విషజంతువులు మానవజాతి మధ్యనే మనుగడ సాగించడంతోనే వాటిపై భయం ఏర్పడుతున్నదని వారు తేల్చిచెప్పారు.

చివరికి 6 నెలల చిన్నారులకు పాము లేదా సాలీడు ఫొటోను చూపిస్తే భయపడతారట! ఈ వయసులోని వారు దేనినీ సరిగా గ్రహించలేకపోయినప్పటికీ, పామును చూస్తే భయపడటంపై శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

## న్యూక్లియర్ బాంబర్లపై అమెరికా మహా నిర్ణయం



వాషింగ్టన్ : అమెరికాకు కిమ్ జోన్ ఉన్ భయం పట్టుకుంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత తొలిసారి వాయు సేనను నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. అణ్వాయుధాలు అమర్చిన యుద్ధ విమానాలు రోజులో 24 గంటలూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ కాలేదు, కానీ బీ-52 యుద్ధ విమానాలు యుద్ధ సన్నద్ధంగా ఉండటం 1991లో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత ఇదే తొలిసారి.

డిఫెన్స్ వన్ వెల్లడించిన వివరాల ప్రకారం అణ్వాయుధాలతో కూడిన అమెరికా యుద్ధ విమానాలు అనుక్షణంగా సంసిద్ధంగా ఉంటాయి, ఆదేశాలు జారీ అయిన మరుక్షణం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉంటాయి. ఉత్తర కొరియా అణ్వాయుధాలతో దూకుడు ప్రదర్శించడం, కిమ్ జొంగ్ ఉన్ వైఖరిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోరాట దృక్పథాన్ని చూపిస్తుండటం, రష్యా సాయుధ దళాల క్రియాశీలత వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ సన్నాహాలను ఏదైనా ప్రత్యేక కార్యక్రమం కోసం చేయడం లేదని, అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నామని అమెరికా వాయు సేన చీఫ్ ఆఫ్ స్టాఫ్ డేవిడ్ గోల్డ్‌ఫీన్ చెప్పారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేయడానికే అమెరికా ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

## మూఢ నమ్మకాలకు చట్టంతో కట్టడి..!

బెంగళూరు : మూఢ నమ్మకాలతో చేపట్టే చర్యలను ఇక ఎంత మాత్రమూ ఉపేక్షించరాదని కర్ణాటక సర్కారు నిర్ణయించింది. అమానవీయ సాంఘిక చర్యలు, చేతబడి నివారణ, నిర్మూలన బిల్లు-2017 పేరుతో రూపొందించిన ముసాయిదా బిల్లును ఇటీవల కేబినెట్ ఆమోదించింది. అమానవీయ చర్యలను ఇకపై నేరంగా పరిగణిస్తారు. నవంబరులో బెళగావిలో జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో దీన్ని ప్రవేశపెడతారు. ఇలాంటి బిల్లు తేవడం దేశంలో ఇదే తొలిసారి. ఎన్నికల ముందు బిల్లును తెరపైకి తేవడం చర్చనీయాంశమైంది. కర్ణాటకలో దశాబ్దాలుగా కొనసాగుతున్న మడెస్నాన, నగ్నపూజలకు స్వస్తి పలకాలని బిల్లులో ప్రధానంగా చేర్చారు. కర్ణాటకలో క్షుద్రపూజలు, నగ్నపూజలు అధికమనే పేరుంది.

సమాజ సేవకుల సలహాల మేరకు... మూఢ నమ్మకాలకు స్వస్తి పలికేలా చట్టం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రాలతో రోగాన్ని నయం చేసే విధానం, చేతితో శస్త్ర చికిత్సలు జరుపుతామనే ప్రచారం, మంత్రాలతో పశువుల నుంచి పాలు పెరిగేలా చేస్తామనడం, దెయ్యం పట్టిందని, దాన్ని విడిపిస్తామంటూ ప్రజలను చిత్రహింసలకు గురిచేయడం, పూర్వజన్మ పాపపరిహారం అంటూ లైంగిక క్రియలకు ప్రేరేపించడం, దైవానుగ్రహమంటూ నగ్నంగా ప్రార్థనలు చేయడం, బాణామతి పేరిట ఇళ్లపై రాళ్లు విసరడం, గర్భంలోని శిశు వు లింగాన్ని మార్చేస్తామంటూ జరిగే ప్రచారం, అగ్నిగుండాలలో నడవడం, ఎంగిలి ఆకులపై పొర్లు దండాలు తదితర చర్యలపై నిషేధం విధించింది.

***వీటికి మినహాయింపు***

తొలుత జ్యోతిష్యాలు, వాస్తును కూడా చేర్చినప్పటికీ సంఘ్‌పరివార్ సంస్థల అభ్యంతరంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జ్యోతిష్యం, వాస్తును ఈ నిషేధం నుంచి మినహాయించారు. మతపరమైన స్థలాల్లో ప్రదక్షిణ, యాత్ర, పరిక్రమ వంటి చర్యలు చేపట్టవచ్చు. హరికథ, కీర్తన, ప్రవచన, భజన, సంప్రదాయ కళల బోధన, ఆచరణ, ప్రచారం చేసుకోవచ్చు. బిల్లుకు చట్టబద్ధత వస్తే మూఢ నమ్మకాలను కొనసాగించేవారికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.5 వేలకు తగ్గకుండా జరిమానా విధిస్తారు.

## సమయం

### మానసిక మాలిన్యమును తొలగించుకోవాలి

మనస్సు మనిషిని నడిపిస్తుంది. ప్రతి మనిషి తన మనస్సు చెప్పిందే చేస్తూ వుంటాడు. మన మనస్సును శుద్ధి చేసుకొని జీవనయానం సాగిస్తే మనిషికి తిరుగు వుండదు. మన మనస్సులోంచి కుళ్ళు, కుతంత్రాలు ప్రారదోలాలి. ఇతరుల పట్ల పవిత్రమైన భావనతో మసలాలి. మంచి మనస్సుతో చేసే ఏ పనైనా మంచి ఫలితాన్ని తప్పకుండా ఇస్తుంది. ఇతరులకు మంచి మనస్సుతో చేసే సహాయం గానీ, వారి సమస్యల పరిష్కారానికై సలహాగాని అత్యంత విలువైనది. మంచి సలహాతో వారు సమస్యల నుండి బయటపడవచ్చు. కానీ చాలామంది ఎదుటివారి అభివృద్ధిని పైకి అభినందిస్తూనే లోలోన వారి పతనాన్ని కాంక్షిస్తుంటారు. ఈర్ష్య, అసూయ అనేవి ఈ భావనకు మూలం. మనకు లేనిదానివి, కావలసినదానిని సాధించుకోవాలని అనుకోవడం మంచిదే. కానీ ప్రక్కవాడికి ఉన్నదానిని చూసి ఓర్వలేకపోవడం చాలా తప్పు. ఈ రకమైన మానసిక మాలిన్యం చాలామందిలో ఎక్కువ. మనస్సులోని మాలిన్యాన్ని తొలగిస్తే ముందుగా మనకు ప్రశాంతత లభిస్తుంది. దానితో సంతృప్తి కలిగి హాయిగా జీవించగలుగుతాం. ఈ విషయాన్ని గురించి ఓ శతక పద్యాన్ని మననం చేసుకుందాం

'పంటలోన కలుపు పనిగట్టుకొని పీకి
పారవేయవచ్చు పంట హెచ్చు
మనసులోని కలుపె? మనిషి తరముగాదు
కంటి నలుసుర పులికంటిమాట!'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : కార్తీక శు. షష్ఠి, ఉ. 8.49
పూర్వాషాఢ రా. 9.32; ఉ.వ.. 7.09 వరకు

బుధవారం
25-10-2017

**మేషం** : అసాధ్యమనుకున్న పనుసు తేలికగా పూర్తి చేస్తారు. రాజకీయ నాయకులు తరచు సభాసమావేశాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది. ఖర్చులు అధికమవుతాయి. **వృషభం** :ఆర్థిక, కుటుంబ పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలు మీరే సమీక్షించుకోవడం మంచిది. స్త్రీలకు సంపాదన పట్ల ఆసక్తి పెరుగుతుంది. శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. వీలైనంత వరకు బయట ఆహారం తీసుకోవడం చేయకండి. మీ మంచితనమే మీకు శ్రీరామ రక్షగా ఉంటుంది. దూరప్రయాణాలు తప్పవు. **మిథునం** : వృత్తి వ్యాపారాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో అప్రమత్తత అవసరం. ప్రతి పని చేతిదాకా వచ్చి వెనక్కిపోవడం వల్ల ఆందోళన పెరుగుతుంది. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. **కర్కాటకం** : ఆర్థిక విషయాల్లో మీ లెక్కలు తారుమారు కాగలవు. స్త్రీలకు ఒక స్థిరాస్తి అమర్చుకోవాలనే ఆలోచన స్ఫురిస్తుంది. రాబడికి మించిన ఖర్చులుంటాయి. చేతిలో ధనం నిలబడటం కష్టమే. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరగలదు. భాగస్వామిక సమావేశాల్లో కొత్త అంశాలు చర్చకు వస్తాయి. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం. **సింహం** : బృంద కార్యక్రమాల్లో పాల్గొంటారు. మీ ఏమరు పాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చుకుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారులను ఆకట్టుకుంటారు. మీ శ్రీమతి ఆరోగ్యంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్ రంగాల్లో వారికి చికాకు తప్పదు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. **కన్య** :ఉద్యోగస్తులు పై అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. బ్యాంకింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త పడండి. నూతన పెట్టుబడుల విషయంలో జాగ్రత్త తప్పదు. గృహంలో ఒక శుభకార్యం సానుకూలమవుతుంది. ట్రాన్స్‌పోర్ట్, ట్రావెలింగ్ రంగాల వారికి చికాకులు తప్పవు. **తుల** : ఉమ్మడి వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి పెరుగుతుంది. స్త్రీలకు ఆభరణాలు, విలాస వస్తువుల పట్ల మక్కువ పెరుగుతుంది. **వృశ్చికం** : స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి సదవకాశాలు లభిస్తాయి. సోదరీ, సోదరుల మధ్య సంబంధ బాంధవ్యాలు బాగుంటాయి. ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెలకువ అవసరం. ప్రత్యర్థులు మిత్రులుగా మారుతారు. చేస్తున్న ఉద్యోగాలను తొందరపడి వదులుకోవద్దు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. **ధనుస్సు** : ఫైనాన్సు, షేర్ వ్యాపారులు తెలివిగా ప్రవర్తిస్తే మంచి లాభాలు పొందుతారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. ఏదైనా అమ్మకానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. **మకరం** : ప్రయాణాల్లోను, బ్యాంక్ వ్యవహారాల్లోను మెలకువ అవసరం. మీ పనులు అన్నీ స్వయంగా చూసుకోవడం వలన చాలా నష్టాలు నివారింప బడుతాయి. ఆర్థిక కార్యకలాపాలకు లోటు లేని జీవనం సాగుతుంది. **కుంభం** : వృత్తులు, క్యాటరింగ్ పనివారలకు సదవకాశాలు లభిస్తాయి. పై చదువుల విషయంలో విద్యార్థుల ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారు. పాత మిత్రుల కలయిక మీకు సంతృప్తినిస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయడం వల్ల సంతృప్తి కానవస్తుంది. రాజకీయాల్లోని వారికి కార్యక్రమాలు వాయిదా పడటం వల్ల ఆందోళన తప్పదు. **మీనం** : వ్యాపారాభివృద్ధికి చేసే కృషిలో సఫలీ కృతుల వుతారు. ప్రియతముల కోసం ధనం బాగా వ్యయం చేస్తారు. కుటుంబీకుల మధ్య బంధువుల ప్రస్తావన వస్తుంది. ఉద్యోగస్తులు విలువైన కానుకలిచ్చి అధికారులను ప్రసన్నం చేసుకుంటారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి.

# ఆపదలో ఆదుకునే నారసింహుడు

## సంకీర్తన



నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసమే ఆవిర్భవించాడు కనుక, భక్తులను ఆదుకోవడంలోను .. అనుగ్రహించడంలోను ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడని అంతా విశ్వసిస్తుంటారు. ఆ స్వామి కొలువైన ప్రాచీనమైన క్షేత్రాల్లో ప్రకాశం జిల్లా పరిధిలో గల 'సింగరాయ కొండ' ఒకటిగా కనిపిస్తూ వుంటుంది. ఈ క్షేత్రం మహిమాన్వితమైనదని చెప్పబడే ఎన్నో సంఘటనలు ఇక్కడ కథలు .. కథలుగా వినిపిస్తూ వుంటాయి.

పూర్వం ఈ స్వామిని అర్చించే పూజారి, పసివాడైన తన బిడ్డతో సహా ఆలయానికి వెళ్లి, స్వామివారికి నైవేద్యం సమర్పించి వెనుతిరిగాడట. తన బిడ్డను ఆలయంలో మరిచిపోయి వెళ్లిన ఆయనకి, చాలా సేపటి తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. తన మతిమరుపుకు తిట్టుకుంటూ, పరుగు పరుగున ఆలయం దగ్గరికి చేరుకున్నాడు. పిల్లవాడు ఆకలితో ఏడుస్తూ ఉంటాడని అనుకుంటూ, ఆతృతగా తలుపులు తెరిచాడు.

ఆలయంలో ఆడుకుంటోన్న పిల్లవాడిని చూసి ఆనందంతో పొంగిపోయాడు. పిల్లవాడిని అక్కున చేర్చుకుని "ఆకలి వేయలేదా?" అని అడిగితే, నరసింహస్వామి మూర్తిని చూపించి ఆయన తనకి అన్నం తినిపించాడని చెప్పాడట. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా ఉన్నాడని చెప్పడానికి ఇదొక నిదర్శనమని చెబుతుంటారు. ఇక్కడి నారసింహుడు మనసున్నవాడనీ .. మహిమగలవాడనీ .. ఆపదలో ఆదుకునే బంధువని విశ్వసిస్తుంటారు.

### ఈ శకునం శుభసూచకమే !

ఏదైనా ఒక ముఖ్యమైన పనిమీద ఎక్కడికైనా వెళ్లాలని అనుకున్నప్పుడు, శకునం చూసుకుని బయలుదేరుతూ వుంటారు. కాస్త ఆలస్యమైనా మంచి శకునం చూసుకునే అడుగు బయటికి పెడుతుంటారు. ఇలా మంచి శకునం చూసుకుని బయలుదేరడం వలన, వెళ్లిన పని సఫలీకృతమవుతుందనే విశ్వాసం పూర్వకాలం నుంచీ వుంది. ఎవరికి వాళ్లు తాము తలపెట్టేకార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలనే ఆశిస్తారు. అందుకే శకునానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు.

ఈ నేపథ్యంలో కొన్ని శకునాలు మంచివిగా ... మరికొన్ని శకునాలు అందుకు విరుద్ధమైనవిగా చెప్పబడుతున్నాయి. ఇక కార్యసిద్ధిని కలిగించే శకునాలలో పూలు - పండ్లు కనిపిస్తూ వుంటాయి. సాధారణంగా దైవదర్శనానికి వెళ్లాలని అనుకోగానే ముందుగా గుర్తుకువచ్చేది పూలు .. పండ్లే. భగవంతుడిని పూలతో అలంకరిస్తూ .. అర్చిస్తూ వుంటారు. ఆయనకి వివిధరకాలైన పండ్లను నైవేద్యంగా సమర్పిస్తూ వుంటారు.

ఇక శుభకార్యాలలోను పూలు - పండ్లకి ప్రధానమైన స్థానం ఇవ్వబడుతుంది. ఇవి లేకుండా శుభకార్యమనేది జరగనే జరగదు. దీనినిబట్టి పూలు - పండ్లు ఎంతటి శుభప్రదమైనవో అర్థంచేసుకోవచ్చు. అందువలన పూలబుట్టతో గానీ .. పండ్లబుట్టతో గాని ఎవరైనా ఎదురురావడం శుభసూచకంగా విశ్వసించడం జరుగుతోంది. పూలతోను ... పండ్లతోను కూడిన శకునం మంచిదిగా భావించి వెంటనే బయలుదేరవచ్చని స్పష్టం చేయబడుతోంది.

# 2013 చట్టం ప్రకారమే భూసేకరణ జరగాలి

## నిమ్జ్ సభలో రైతులు



న్యాల్‌కల్: జాతీయ ఉత్పాదక మండలి(నిమ్జ్)నకు భూసేకరణ రైతుల నుంచి ఇష్టారీతిగా చేపడితే ప్రతిఘటిస్తామని, ఏడాదిలో రెండు పంటలు పండే భూముల జోలికి రావద్దని, 2013 భూసేకరణ చట్టం ద్వారానే వ్యవసాయానికి పనికిరాని భూములను మాత్రమే సేకరించాలని రైతులు డిమాండ్ చేశారు. మామిడ్గి గ్రామంలో నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచి నాగరాణి అధ్యక్షతన కొనసాగిన సభలో ఆర్‌డీఓ అబ్దుల్ హమీద్, నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ శివరాజ్, తహసీల్దార్ దశరథ్‌సింగ్ పాల్గొని రైతులకు 2013 భూసేకరణ చట్టం, 123, 120 జీఓ తదితరాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వేల కోట్లను కేటాయించి ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పనులను వేగవంతం చేసిందని, రానున్న రోజుల్లో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందనుందన్నారు. ఈ ప్రాంత యువతీ-యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించ నున్నాయన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అందరు సహకరిం చాలన్నారు. ప్రాజెక్టుల ఏర్పాటుకు విధి విధానాలు ప్రకటించ కుండా ముందస్తుగా భూసేకరణ చేపట్టే ఆలోచనను ప్రభుత్వం, అధికారులు ఉప సంహరించు కోవాలన్నారు. కార్యక్రమంలో నిమ్జ్ భూ బాధితుల సంఘం అధ్యక్షుడు రాంచెందర్, రైతులు తుక్కారెడ్డి, గుండారెడ్డి, సంగారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సత్తార్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# తితిదే ధార్మిక విజ్ఞాన పరీక్షలో పాల్గొనండి

## 31లోపు దరఖాస్తులు సమర్పించాలి

మహబూబ్‌నగర్ : విద్యార్థుల్లో సనాతన సంప్రదాయాలపై అవగాహన పెంపొందించే నిమిత్తం తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ధర్మపరిచయం పేరిట ధార్మిక విజ్ఞాన పరీక్ష నిర్వహించనున్నట్లు తితిదే ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో సన్మార్గమైన అంశాలను బోధించేందుకు గత 34 ఏళ్లుగా తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగా 2017- 18 విద్యా సంవత్సరం నిమిత్తం 6, 7, 8 తరగతి విద్యార్థులకు ధర్మపరిచయం పేరిట పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను మహబూబ్‌నగర్‌లోని తితిదే కల్యాణ మండపంలో తీసుకోవచ్చని, ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31లోపు తితిదే కార్యదర్శి, హిందూ ధర్మప్రచార పరిషత్తు, తితిదే దేవస్థానం, శ్వేత బిల్డింగ్, తిరుపతి-517502 చిరునామాకు పంపించాలని సూచించారు. కులమతాలకు అతీతంగా ఈ పరీక్షలో పాల్గొనవచ్చని అన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసే విద్యార్థికి ధర్మపరిచయం పేరిట పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న పరీక్ష ఆయా పాఠశాల కేంద్రాల్లో కొనసాగుతుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 90594 48033 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తితిదే శ్రీవారి సేవకులు పి.తారకం, కేశవులు, పాండురంగం, చంద్రకళారెడ్డి, నిర్మలమ్మ, నర్సింహ్మారావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర కోసం కృషి

ఇచ్చోడ : పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. ఆయన ఇచ్చోడలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పంటలకు మద్దతు ధర కోసం రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అమ్మకాలకు వచ్చే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, యార్డులోనే పత్తి విక్రయించాలన్నారు. సీసీఐ ద్వారా కూడా పత్తి కొనుగోళ్లు చేపట్టామన్నారు. అంతకుముందు యార్డులో పూజ చేసి ఎలక్ట్రానిక్ కాంటాపై పత్తి బండి తూకం వేయించారు. తొలి రోజు క్వింటా పత్తికి రూ.4500 చొప్పున ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు వచ్చారు. మార్కెట్ ఛైర్మన్ అడె శీల ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి రమేష్, మార్కెట్ వైస్ ఛైర్మన్ రాథోడ్ ప్రకాష్, మార్కెట్ డైరెక్టర్లు, తెరాస మండల అధ్యక్షుడు మెరాజ్‌అహ్మద్, గుడిహత్నూర్ అధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, జడ్పీటీసీ సభ్యుడు కేశవ్ గిత్తె, సొసైటీ డైరెక్టర్ అబ్దుల్ రషీద్, ఎంపీటీసీ సభ్యుడు దయాకర్‌రెడ్డి, పెరుమండ్ల నారాయణ, కాట్‌పెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంబేకర్ పాండురంగ్, గట్టు మహేందర్, ముస్తఫా, వెంకటేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం

భువనగిరి: ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు వనం రాజు ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలను, బోధన రుసుంలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. గత సంవత్సరం నుంచి ఉపకారవేతనాలు, బోధనా రుసుంలు చెల్లించని కారణంగా విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1400 కోట్లు విద్యార్థులకు చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ పరీక్షల్లో డిటెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ విధానంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కలుగలేదన్నారు. ప్రవేశాల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ ప్రక్రియపై అవగాహనలేని కారణంగా నష్టపోతున్నారని అన్నారు. అనంతరం ఈమేరకు వినతి పత్రాన్ని నాయకులు ఆర్డీవో భూపాల్‌రెడ్డికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టుపల్లి నవీన్, దయ్యాల నవీన్, రాజేష్, శివ, ముత్యాల సాయి, లక్ష్మణ్, మమత, సాయి చరణ్, నాగేందర్, ఇమ్రాన్, లక్ష్మి, ప్రవళిక, సుజాత పాల్గొన్నారు.

## ముత్తంగి రూపంలో రామయ్యకు పూజలు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ముత్తంగి రూపంలో రామయ్య దర్శన భాగ్యం కలగడంతో భక్తులు ప్రణమిల్లి తమ ఆనందానికి గుర్తుగా కానుకలు సమర్పించి చల్లగా చూడాలని దేవదేవున్ని వేడుకున్నారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకరణలో అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయ కుడు మరింత అందంగా కనిపించి భక్తులను మురిపించాడు. అర్చకులు మూలవిరాట్‌కు సుప్రభాతం పలికి ఆరాధన చేశారు. వైదిక పెద్దలు చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ పుణ్యాహ వాచనం జరిపి కంకణ ధారణ కన్యా దానం నిర్వహించి వధూవరుల గోత్ర నామాలను పఠించారు. సీతమ్మకు యోక్త్రధారణ రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కడు రమణీయంగా జరిగింది. మంగళవాయిద్యాలు మార్మోగు తుండగా మాంగళ్య ధారణ కనులకు పండుగ చేసింది. తలంబ్రాల వేడుక ఆధ్యాత్మికతను పంచగా దర్బారు సేవ తన్మయులను చేసింది. క్రతువును జరిపిన తీరుకు భక్తులు పులకించి పోయారు.

## జాషువా రచనలు

# తెలుగు సాహిత్యానికి కరదీపికలు

నెల్లూరు : జాషువ రచనలు నేటితరాలకే కాకుండా తెలుగు సాహిత్యానికే కరదీపికలని.. ప్రజల్లో స్ఫూర్తినింపి చైతన్యం వైపు నడిపిస్తాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వి.వీరయ్య పేర్కొన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చిన్నపిల్లల పార్కు సమీపంలోని జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జాషువ కవిత్వం-వర్తమానం అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ...

కులం, మతం పేరిట మనుగడ సాగిస్తుంటే జాషువా ఆనాడే విశ్వన రుడనని ప్రకటించుకున్న మాన వతావాదన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం మాట్లా డుతూ తెలుగు సాహిత్యాన్ని ఆధునికీ కరించిన కవుల్లో అగ్రగణ్యుడు జాషువా అన్నారు.

కోదాడ కేఆర్ఆర్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వీయ ప్రతిభతో విశ్వనరుడుగా ఎదిగి తన రచనలతో తెలుగు ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్న నవయుగ కవి చక్రవర్తి జాషువా అన్నారు. ఈ కార్యక్రమంలో నేటి కలాలు-రేపటి గళాలు అనే సాహిత్య మాసపత్రికను ముఖ్య అతిథులు విడుదల చేశారు.

# ప్రాధాన్యత ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారం

వీరన్నపేట : ప్రజా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా సంయుక్త పాలనాధికారి బి.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమై డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు రాలేనివారి కోసం ప్రతి డయల్ యువర్ కలెక్టర్ నిర్వహిస్తు న్నామని, పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. రామడుగు మండలం వెలిచాల నుంచి మంజుల మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నామని అధికారులు వచ్చి తనిఖీ చేశారని కానీ ఇంతవరకు బిల్లు రాలేదని తెలపగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిర్మలాపూర్ నుంచి మల్లేశం మాట్లాడుతూ.. భూ రికార్డుల సవరణలో భాగంగా తన భూమిని వేరేవారి పేరున రాశారని ఫిర్యాదు చేయగా ఆర్డీవో ద్వారా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుజూరాబాద్ మండలం కందుగుల నుంచి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో కొందరు బావి తవ్వి సొంతానికి వాడుకుంటున్నారని తెలుపగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇల్లందకుంట మండలం మల్యాల నుంచి రత్నాకర్ మాట్లాడుతూ.. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేయగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు.

జమ్మికుంట మండలం మడిపల్లి నుంచి రాజు మాట్లాడుతూ.. తనను ఇతర కులస్తులు వేధిస్తున్నారని, ఇదివరకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తెలుపగా ఇప్పటికే విచారణ చేశామని నివేదిక ఆధారంగా చర్యలుంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆయేషా మస్రత్‌ఖానం, జడ్పీ సీఈఓ పద్మజారాణి, జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్, మెప్మా పీడీ పవన్‌కుమార్, ఉద్యానశాఖ డీడీ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను గద్దె దించే వరకు పోరాటం



నల్గొండ : అధికార మదంతో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించే వరకు పోరాటం కొనసాగిస్తామని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నల్గొండలోని బండారు గార్డెన్స్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందన్నారు. వరి కోతలు మొదలై రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటం సరికాదన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున నష్టపరిహారం, మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కటికం సత్తయ్యగౌడ్, నల్గొండ, మునుగోడు, నకిరేకల్ నియోజవర్గాల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నల్గొండ: రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు వస్తున్న రైతులు, కార్యకర్తలతో ర్యాలీగా వస్తున్న ఆయనను ప్రవేశ ద్వారం ఎదుటే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ గేటు ఎదుట పత్తి దహనం చేసి నిరసన తెలిపారు. పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌ను వీడటం లేదని ఎద్దేవా చేశారు. ఈనెల 19న పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని మంత్రి హరీశ్‌రావు చెప్పినా ఇప్పటి వరకు అనేకచోట్ల ఇంకా ప్రారంభించలేదన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని.. తదనంతరం రైతు రాజ్యం వస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం జేసీ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు దూదిమెట్ల సత్తయ్య, వెంకట్‌రెడ్డి, ఎంపీపీ రాజు, బుజ్జి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెవివి రిజిస్ట్రార్‌గా ఆచార్య శివశంకర్

డిచ్‌పల్లి : తెలంగాణ విశ్వవిద్యాలయంలో అనూహ్య పరిణామం నెలకొంది. నూతన రిజిస్ట్రార్ నియామకంపై ఉపకులపతి సాంబయ్య ఎవరూ వూహించని నిర్ణయం తీసుకున్నారు. ఆచార్య శివశంకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శివశంకర్‌కు స్వయంగా ఉప కులపతి నియామక పత్రం ఇచ్చారు. ఆయన సమక్షంలోనే రిజిస్ట్రార్ ఛాంబర్‌లో తాత్కాలిక రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న విద్యావర్ధిణి నుంచి శివశంకర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇది విశ్వవిద్యాలయంలో చర్చ నీయాంశమైంది. విద్యావర్ధిణిని గత జులై నెలలో తాత్కాలిక రిజిస్ట్రార్ నియమించారు. ఇప్పుడు సాహసోపేత నిర్ణయం తీసుకొని సీనియర్ ఆచార్యునికి పదవిని కట్టబెట్టారు. వాస్తవానికి గతంలో రిజిస్ట్రార్‌గా పని చేసిన జయప్రకాష్‌రావు పదవీ కాలం ముగియడంతో నూతన రిజిస్ట్రార్ నియామకంపై ఉపకులపతి ఆలోచనలో పడ్డారు. శివశంకర్‌నే నియమిస్తారని తీవ్ర ప్రచారం జరిగింది. కానీ ఆయన్ను నియమించ వద్దని కొందరు ఉపకులపతిపై ఒత్తిడి పెంచినట్లు అప్పట్లో అందరు చర్చించుకున్నారు. దీంతో గత జులైలో విద్యావర్ధిణికి పదవి ఇచ్చి వర్సిటీ చరిత్రలో మహిళకు అవకాశం ఇచ్చారు. మూడు నెలలు గడువక ముందే వూహించని నిర్ణయం తీసుకొని శివశంకర్‌ను నియమించారు. శివశంకర్ గతంలో రెండు పర్యాయాలు మూడున్నరేళ్లు రిజిస్ట్రార్‌గా పని చేశారు. అప్పట్లో డిచ్‌పల్లిలో వర్సిటీ క్యాంపస్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 6 కోర్సులున్న వర్సిటీని 21 కోర్సులకు పెంచడం, కళశాల భవనాలు, వసతి గృహాల నిర్మాణం, భిక్కనూర్ దక్షిణ ప్రాంగణం, సారంగాపూర్ క్యాంపస్‌ల అభివృద్ధికి కృషి చేశారు. అకడమిక్ అడిట్ సెల్ డె%రెక్టర్‌గా, డీన్‌గా, విభాగాధిపతి శివశంకర్‌కు వర్సిటీలో అపార అనుభవం ఉంది. వర్సిటీకి పలువురు ఇన్‌ఛార్జి ఉపకులపతుగా ఉన్న కాలంలో రిజిస్ట్రార్‌గా శివశంకర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. అలాగే దాదాపు రెండేళ్లు రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు ఓఎస్డీగా అసెంబ్లీలో విధులు నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల ఉన్నత విద్యా మండలిలో శివశంకర్‌ను సభ్యుడిగా అవకాశం కల్పించింది. వర్సిటీకి కీలక తరుణంలో రిజిస్ట్రార్‌గా నియమించడం తనపై మరింత బాధ్యత పెంచిందని, ఉపకులపతి ఆచార్య సాంబయ్య సూచనలకు అనుగుణంగా అధ్యాపకులు, విద్యార్థుల సమన్వయంతో పనిచేస్తానని శివశంకర్ తెలిపారు.

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

## సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారావు



ఒంగోలు : జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎల్.నరసింహారావు అన్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన సీనియర్ సహాయకులకు డీటీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌తో పాటు తహసీల్దారు కార్యాలయాల్లో మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉద్యోగినులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదన్నారు. అత్యవసర సమయాల్లో తప్ప వీక్షణ సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లు సాయంత్రం ఆరు గంటల్లోపు పూర్తి చేయాలని, ప్రభుత్వ సెలవు దినాల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను అధికారులకు విన్నవించుకోవడానికి అవకాశం కల్పించడం లేదని.. దస్త్రాల పరిష్కారంలో కావాలనే అనవసర కాలయాపన చేస్తున్నారని కార్యవర్గ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్- ఎ విభాగంలో సిబ్బందిని పెంచి రెవెన్యూ ఉద్యోగుల సర్వీసు సమస్యలతోపాటు ఇతరాలనూ పరిష్కరించాలన్నారు. వివిధ కారణాలతో సెలవులో ఉన్న రెవెన్యూ ఉద్యోగులకు తిరిగి పోస్టింగ్‌లు, సెలవులు మంజూరు చేసే విషయంలో యంత్రాంగం అవలంబిస్తున్న తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యనిర్వాహక సిబ్బందికి బయో మెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న జరిగే రాష్ట్ర ఎన్నికల్లో బొప్పరాజు నాయకత్వాన్ని బలపరుస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి నున్నా రాజేష్, సహాయ కార్యదర్శి కాశయ్య, కోశాధికారి జె.డానియేల్, ఓఎస్‌కే వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు రజనీకుమారి, డివిజనల్ యూనిట్ల అధ్యక్షులు పూతకోలు శ్రీనివాసరావు, ఎస్.వి.సుధాకర్, గండి జయపాల్, బ్రహ్మయ్య, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్విజ్ పోటీలు

ఒంగోలు : 120 కోట్ల మంది ప్రజలతో.. విభిన్న సామాజిక వర్గాలు, భాషలు, జీవన సంస్కృతులతో ప్రపంచంలో మరెక్కడా కాని అద్భుతమైన భిన్నత్వ- ఏకత్వ సిద్ధాంతంతో ప్రపంచాభివృద్ధిలో శరవేగంగా దూసుకువెళుతున్న భారతదేశం గురించి ప్రతి విద్యార్థి, యువత క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భారత్ వికాస్ పరిషత్తు(బీవీపీ) జాతీయ నిర్వహణ కార్యదర్శి సురేష్‌జైన్(దిల్లీ) కోరారు. ఆదివారం అంజయ్య రోడ్డు ఏకేవీకే డిగ్రీ కళాశాల ఆవరణలో స్థానిక శాఖ నిర్వహణలో జరిగిన 13 జిల్లాల విద్యార్థుల విజ్ఞాన పోటీ భారత్- కో- జానో(భారత దేశం గురించి తెలుసుకో) అన్న కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం గురించి విద్యార్థులకు బాల్యంలోనే అవగాహన ఏర్పడితే అవినీతి రహిత, దేశభక్తి సహిత సమాజ నిర్మాణానికి పునాది పడినట్లే అన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత సహనశీలమైన భారతావనిలోని త్యాగ ధనులు, పోరాట యోధులు, వైజ్ఞానిక వేత్తలతోపాటు ఎన్నో సంస్కృతుల గురించి పూర్తి స్థాయిలో జ్ఞానం సాధించాలని ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. బీవీపీ స్థానిక శాఖ అధ్యక్షుడు బెజవాడ చక్రవర్తి సదస్సుకు సంధానకర్తగా వ్యవహరించారు. బీవీపీ దక్షిణ భారత కార్యదర్శి డి.పురుషోత్తమశాస్త్రి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జీవీడీ ప్రసాదరావు, రావూరి నారాయణ, లయన్స్ ఉమెన్ సిటిజన్స్ అధ్యక్షురాలు మేడికొండ రచన, న్యాయవాది బండారు లక్ష్మీనారాయణ, జల వనరులశాఖ డీఈ వీరయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏకేవీకే కళాశాల ఉపాధ్యక్షుడు సి.వి.రామకృష్ణారావు ప్రసంగించారు. సేవలందిస్తున్న పలువురికి సన్మానాలు చేశారు.




# చిన్నారుల్లో డిప్రెషన్




ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది.

ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ముఖవర్చస్సుకు క్యారెట్



మహిళలకు అందమైన మోముంటే అందరూ చాలా బాగుందంటారు. దీనికి రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కాని ఇంట్లో దొరికే వస్తువులతో ప్రయోగాలు చేసుకోవచ్చంటున్నారు సౌందర్య నిపుణులు.


దీనికి చేయవలసిందల్లా ఒక్కటే... బంగారం లాం టి మేనిమి ఛాయ బంగారంలా మెరవాలన్నా, కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఏ పుష్కలంగా ఉండే క్యారెట్లును వాడాలంటున్నారు. బ్యుటీషియన్స్. ముందుగా ఒక క్యారెట్‌ను తురుముకోవాలి.

అందులో ఒక చెంచా పాలను అందులో కలుపుకొని కాసింత నీటిలో ఉడకబెట్టాలి. చల్లారిన తర్వాత పాలనుకలుపుకుని ముఖానికి, శరీరానికి పట్టిం చండి.

అరగంట అయిన తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరచండి. దీంతో మీ చర్మం కాంతి వంతంగా మారడమే కాకుండా మృదువుగా తయార వుతుంది. ఏదైన వాడే ముందు వాటికి తగిన జాగ్రత్తలు పాటించడం చాలా మంచిది. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో స్కిన్ సమస్యలు దృష్టిలో ఉంచుకుని వాటిని వాడటం మరి మంచిది. అందం గురించి జాగ్రత్తలు తీసుకునే మందు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు పాటించడం ఇంకా మంచిది.

# కడుపులో రాళ్లు పడితే..!

- పిత్తాశయంలో కదలికలు మందగిస్తాయి
- కడుపులో రాళ్లను తొలగించడమే పరిష్కారం
- రాళ్లు ఎక్కువగా ఉంటే జీర్ణం కాదు
- పిత్తాశయ గోడల్లో వాపు వస్తుంది




ఇటీవల కాలంలో కడుపులో రాళ్లు పడటం అన్నది కామన్‌గా మారింది. ఈ మధ్య చిన్న పిల్లల్లో కూడా ఈ సమస్యను గుర్తించటం జరుగుతోంది. తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న వారిలో ఈ సమస్య కనిపిస్తోంది. జీర్ణ వ్యవస్థలోని పిత్తాశయం (గాల్ బ్లాడర్), క్లోమం (పాన్ క్రియాజ్) వంటి భాగాల్లో ఈ రాళ్లు ఏర్పడుతుంటాయి. ఈ రాళ్లతో వచ్చిన అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఈ రాళ్లను బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. రాళ్లను తొలగించటం అన్నది అంతిమ పరిష్కారం అని గుర్తుంచుకోవాలి.

పైత్యరసంలోని కొలిసిస్టిన్ ఎక్కువగా ఏర్పడి నప్పుడు ఇబ్బంది ఏర్పడుతుం ది. దీంతో పాటు పిత్తాశయంలో వాపు ఏర్పడే అవకాశం ఉంటుం ది. దీన్ని కొలిసిస్టిటిస్ అని వ్యవహరిస్తారు. నొప్పి తీవ్రత ద్వారా దీన్ని గుర్తించవచ్చు. కుడి వె%పు పై భాగంలో ఇది మొదలవుతుంది. తర్వాత కుడిపైపు స్కా ప్యులా ఎముక ఉండే చోటికి వ్యాపించవచు. చాలాసార్లు వేపుళ్లు, నూనె దినుసులు, జంక్ ఫుడ్ తిన్న తర్వాత తలెత్తుతుంటుంది. కొద్ది పా టి జ్వరం, డయేరియా, వాంతులు, నాసియా వంటి లక్షణాల్ని కూడా గమనించవచ్చు. కొన్ని సార్లు పిత్తాశయం గోడల్లో వాపు గమనించవచ్చు. తీవ్రమె%న కేసుల్లో నెక్రోసిస్, గోడల్లో ధ్వంసం జరగటాన్ని చూడవచ్చు. గోడలు వాపు ఏర్పడిన పరిస్థితిని సాధారణ కొలిసిస్టిటిస్‌గా వ్యవహరిస్తారు. తర్వాత కాలంలో పిత్తాశయం లో కదలికలు బాగా మందగిస్తాయి. వ్యాధి ముదిరిన దశను తీవ్రతర కొలిసిస్టిటిస్‌గా చెబుతారు.

ఇక క్లోమం విషయానికి వస్తే .. క్లోమంలో స్రవించే ఎంజైమ్‌లు పేగుల్లోకి వచ్చి అక్కడ ఆహారాన్ని జీర్ణం చేయాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ఈ ఎంజె%మ్‌లు క్లోమంలోనే ఉండి పోయి అక్కడ పనిచేయటం మొదలు పెడతాయి. ముఖ్యంగా ట్రిప్సిన్ ఇటువంటి పనులకు పాల్పడుతుంది. దీంతో క్లోమం లోపలి గోడలు పాడె% పోతాయి. క్రమంగా మొత్తం క్లోమం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే పాన్‌క్రియాటిస్‌గా వ్యవహరిస్తారు. ఇక, రాళ్ల సమస్య పెద్దదిగా అయినప్పుడు ఇతర జీర్ణ భాగాలకు ఇబ్బది తలెత్తవచ్చు. కొన్ని సార్లు క్లోమంలో కాల్సియం డిపాజిట్లు ఎక్కువగా పేరుకొని పోతే రాళ్లుగా మారతాయి. ఇవి జీర్ణ రసాల్ని అంటే ఎంజైమ్‌ల స్రావాన్ని అడ్డుకొనుట ద్వారా సమస్యల్ని తెచ్చి పెడతాయి. తీవ్రమైన నొప్పితో పేషంట్లు బాధ పడతారు.

పిత్తాశయంలో రాళ్లను గుర్తించాక అది ప్రాథమిక దశలో ఉందా, లేక వ్యాధి తీవ్రం అవుతోందా అన్నది తేల్చుకొంటారు. చాలా ప్రాథమిక దశ అయినప్పుడు మందులతో వాటిని కరిగించేందుకు యత్నిస్తారు. లేని పక్షంలో కొలిసిస్టెక్టమీ అనే ఆపరేషను అవసరం అవుతుంది. పూర్వం కడుపుని కోసి ఈ ఆపరేషను చేయాల్సి వచ్చేది. ఇప్పుడు లాపరోస్కోపీ విధానంలో ఇది చాలా సురక్షితంగా, తేలికగా మారింది. చాలా సార్లు పిత్తాశయాన్ని తొలగించటమే అంతిమ పరిష్కారం అవుతుంది. క్లోమంలో రాళ్లను కరిగించటానికి లిథో ట్రి ప్సీ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో దీన్ని సురక్షితంగా తేలిగ్గా పూర్తి చేయవచ్చని గుర్తుంచుకోవాలి. ఇది ఆధునిక టెక్నాలజీ తో కూడిన ఆపరేషన కాబట్టి నిపుణులె%న సర్జన్‌లతో చేయించుకోవటం మేలు.

మానవ శరీరంలో అతి చిన్న భాగాల్లో ఒకటిగా పిత్తాశయంను చెప్పుకోవచ్చు. కడుపులో కుడి వైపున పై భాగంలో ఇది అమరి ఉంటుంది. కాలేయానికి కింది భాగంలో ఉండే సంచీ వంటి భాగం ఇది. ఒక రకంగా చెప్పాలంటే కాలేయానికి అనుసంధానంగా వ్యవహరించే భాగం అనుకోవచ్చు. కాలేయం నుంచి స్రవించే పైత్య రసం తాత్కాలికంగా నిల్వ ఉండే సంచీ వంటి భాగమే పిత్తాశయం. పైత్య రసంలో వాస్తవానికి ఎటువంటి ఎంజైములు ఉండవు. కానీ, జీర్ణక్రియకు సహకరించే కొలెస్టిరాల్, బైలి రుబిన్ అనే పదార్థాలు ఇందులో ఉంటాయి. పైత్య రసం పిత్తాశయంలో ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు కొలిస్టిరాల్‌కానీ, బైలిరుబిన్ కానీ ఎక్కువగా పేరుకొని పోతుంది. అటువంటప్పుడు ఈ పదార్థాలు ఘన రూపంలోకి మారి రాళ్లుగా పరిణామం చెందుతాయి. కొలిస్టిరాల్ కానీ రాళ్లుగా మారితే కొలిస్టిరాల్ రాళ్లు అనీ, బైలిరుబిన్ ఘన పదార్థంగా మారితే పిగ్మెంట్‌రాళ్లు అని వ్యవహరిస్తారు. పైత రసం లో ఇతర పదార్థాల శాతం పెరిగిపోయినా ఇది తలెత్తవచ్చు. కాలేయ వ్యాధులు, రక్త ప్రస రణ వ్యాధులు తలెత్తినప్పుడు కూడా రాళ్లు వస్తుంటాయి. రాళ్లతో నేరుగా వచ్చే ప్రమాదం కంటే ఇతర సమస్యలతో ఇబ్బందులు ఉంటాయి.

# గోళ్ళ ఆరోగ్యమే ... వేళ్ళ అందం

శుభ్రత అనగానే ముందు గుర్తురావాల్సింది చెతులకున్న గోళ్లు. ఎందుకంటే, మనం ఏం తిన్నా ముందు నోట్లోకి వెళ్లాడానికి అస్కారం ఉంది. కాబాట్టి అలాంటి గోళ్లనే మనం నిర్లక్ష్యం చేస్తే, అది అనారోగ్యమని తెలిసినా సరే! ఎప్పటికప్పుడు అనుకుంటూనే మరేం ఫర్వాలేదని బద్ధకించేయడమూ మనకున్న నిత్యమైన అలవాటు. గోళ్ల విషయం లోనే! పైగా గోళ్లను చూసి ఆరోగ్యం ఎలా ఉందో చెప్పేస్తారు వైద్యులు. మరి నఖాల గురించి కొన్ని విషయాలు తెలుసుకుంటే ఆపై జాగ్రత్తలు తీసుకోవడం ఎంత అవసరమో తెలిసిపోతుందిగా!కొందరు రికార్డుల కోసం గోళ్లను పెంచుతుంటారు.అలాంటి వారికి ఇవి చాలా ఉపయోగకరం గోళ్లను పెంచుతారు కాని వారు శుభ్రం పాటించరు అలాంటి వారు క్రింది విధానాలను తెలుసుకోవచ్చు.గోళ్లు కొరుక్కోవడం అనే అలవాటు ఉంటే తక్షణం మానుకోవడం బెటర్!

గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. ఎన్నో రకాల సూక్ష్మక్రిములు, మట్టి నోట్లోకి వెళ్లేది గోళ్ల ద్వారానే! స్నానం తరువాత కత్తిరించుకుంటే గోళ్లు మెత్తగా ఉండి కత్తిరించడం సులువవుతుంది. లేకుంటే పెళుసుగా ఉండి విరిగిపోతాయి. నెయిల్ పాలిష్ వేసుకోవడం ఓకే! కానీ, అదేపనిగా గోళ్లరంగు మంచిది కాదు. ఎందుకంటే రసాయనాలు నిండిన గోళ్లరంగు నోట్లోకి వెళితే అనేక అనర్థాలకు దారితీస్తుంది. గోళ్లు పగుళ్లు తీసినట్లున్నా, కాంతిహీనంగా ఉన్నాయంటే మన శరీరంలో విటమిన్ ఎ, కేల్షియమ్ లోపించాయని అర్థం. అందుకే విటమిన్ ఎ ఉన్న కేరెట్లు, పళ్లు, ఆకుకూరలు, కేల్షియమ్ మెండుగా ఉన్న పాలు, బాదాములు అధికంగా తీసుకోవాలి. అప్పుడే గోళ్లు గులాబీ రంగులో చూడముచ్చటగా మారేది! కాలకృత్యాలు తీర్చుకున్నాక ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగిస్తున్నారంటే చేతులారా వాటిని పాడుచేస్తున్నట్లే! ఈ



**అలవాటుకు స్వస్తి పలికితే నయం!**

ముఖ్యంగ రాత్రి నిద్రపోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కుని, తుడుచుకున్నాక మాయిశ్చరైజర్ అప్లై చేస్తే చేతులు, గోళ్లు మృదువుగా ఉంటాయి.

సబ్బుల వాడకం సమయంలో జాగ్రత్త పాటించాలి.

శరీరానికే కాదు, నీరు గోళ్లకూ అవసరమే! కాబట్టి, మంచినీళ్లు ఎక్కువగా తాగండి!అహారం తీసుకొనే సమయంలో వాటిని చాలా శుభ్రం చేసుకోవాలి.

నాణ్యమైన నెయిల్‌పాలిష్ వాడితే మంచిది.

నెయిల్ పాలిష్ తీయాలంటే బ్లేడుతో గీకడం కాకుండా నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించాలి.

గోళ్లను పెంచే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

తాజా పోషకాహారం తీసుకుంటే గోళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి.

12 విటమిన్ లోపిస్తే గోళ్లు పొడిబారి, నల్లగా మారతాయి. గుడ్డు, పాలు, మాంసం... వంటివాటిలో

12 సమృద్ధిగా వుంటుంది.ఈ జాగ్రత్తలు చాలు! గులాబీ వర్ణంలో మెరిసే సౌందర్యం మీ సొంతమవడానికి! చూపరులను ఇట్టే ఆకట్టుకోవడానికి!

# నీళ్లు సరిగ్గా తాగడం లేదని తెలిపే డేంజర్ సంకేతాలివే..

*నీళ్లు తాగుతున్నారా ? అంటే బాగా తాగున్నాను అన్న సమాధానమే చాలా మంది చెబుతారు. కానీ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక బాటిల్ లేదా ఒక లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. ఇది ఒకరు, ఇద్దరి సమస్య కాదు. చాలా మంది నీళ్లు తాగాలంటే చాలా బద్ధకంగా ఫీలవుతారు. అలాగే నీళ్ల తాగడం అంటే.. ఏదో మెడిసిన్ తాగినట్టు ఫీలవుతుంటారు. కానీ.. నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. 10 రోజుల్లో ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే వాటర్ డైట్ శరీరంలోని ప్రతి భాగం, ప్రతి చిన్న అవయవం, టిష్యూ, కణం అన్నీ కూడా నీటిపై ఆధారపడి ఉంటాయి. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఫ్లూయిడ్స్ స్థాయి బ్యాలెన్స్‌గా ఉంటుంది.*

*బాడీ టెంపరేచర్ రెగ్యులేట్ అవుతుంది. మలినాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అంతే చర్మం ప్రకాశవంతంగా కనిపించడానికి కూడా నీళ్లు తాగడం తప్పనిసరి. రైస్ వాటర్‌తో మైండ్ బ్లోయింగ్ బెన్ఫిట్స్ అయితే శరీరానికి కావాల్సిన స్థాయిలో నీళ్లు అందకపోతే.. శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయి.*

# మాతృత్వపు మధురిమ ఆస్వాదించండి



గర్భధారణ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం చాలా సర్వసాధరణం. ఈ మార్పులు ప్రతి మహిళ శరీరంలోనూ ఏర్పడుతాయి. గర్భధారణ సమయంలో మహిళలకు సాధారణ జీవితాన్ని గడపాలని సూచిస్తుంటారు. అయితే గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కాబట్టి గర్భధారణ సమయంలో ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండటం ఉత్తమైన మార్గం. దాని తర్వాత అన్నీ. ఎందుకంటే గర్భధారణ అనేది 9నెలలు మాత్రమే కాబట్టి ఆ 9నెలలు మహిళలకు చాలా విలువె%న సమయంగా భావించాలి. గర్భధారణ సమయంలో ఎటువంటి కార్యకలాపాలు ప్రమాదకరమె%నవో మీకు తెలిసుండకపోవచ్చు. కానీ మనకు తెలసిన కొన్ని కార్యకలాపాలు మాత్రం న్యూట్రీషియన్ ఫుడ్ అధికంగా తీసుకోవాలి. దూరప్రయాణాలు చేయకూ డదు. దగ్గర ప్రయాణలైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలి మరియు అధిక బరువులు మోయకూడదు మొదలగునవి. కాబట్టీ మీ గర్భధారణ సమయంలో సురక్షితంగా ఉండటానికి చాలా చాలా లౌకిక విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. ఉదా: మీకు రాక్ బ్యాండ్ యొక్క సంగీతానికి హాజరు కావడం అనేది గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపంగా చెప్పవచ్చు. గర్భధారణ సమయంలో అధికంగా వ్యాయామం చేయడంతో హార్ట్ బీట్ పెరుగుతుంది మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెంచుతుంది. గర్భధారణ సమయంలో ఉదర భాగంలో వ్యాక్సింగ్ చేయించుకోవడం కూడా మంచిది కాదు. ఇటువంటి కొన్ని చిన్న విషయాలు మీ గర్భధారణ సమయంలో సురక్షితమా కాదా అని గుర్తించేందుకు మరికొన్ని మీకోసం బోల్డ్ స్కై అందిస్తుంది. ఈ రిస్కీ యాక్టివిటీస్ కు గర్భాధారణ సమయంలో దూరంగా ఉండీ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోండి... ఫర్నీచర్‌ను మార్చకూడదు సాధారణంగా ఇంట్లో వస్తువులు ఫర్నీచర్‌ను ఇక్కడి అక్కడ.. అక్కడవి ఇక్కడ మార్చుతుంటారు. అయితే మీ గర్భధారణ మొదటి సెమిస్టర్ (మొదటి మూడు నెలల్లో) ఇటువంటి రీస్కీ యాక్టివిటీస్ ను నివారించడం చాలా క్షేమం. ఇది మీ మీద ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లలను మోయడం** మీ రెండవ ప్రెగ్నెన్సీ కంటే ముందు మీకు పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఉంటుంది కాబట్టి, వారు 5కేజీల బరువు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అతనిని/ఆమెను ఎత్తుకోవడం నివారించడం. లేదంటే మీ వెన్నుకు ఒత్తిడి కలిగించవచ్చు. స్కేటింగ్ వ్యాయామంలో చాలా మంది రోలర్ స్కేటింగ్‌ను ఉపయోగిస్తారు. అయితే మహిళలు గర్భధరించినప్పుడు, ఈ రోలర్ స్కేటింగ్ వ్యాయామాన్ని మానుకోండి. రోలర్ స్కేటింగ్ చేయడానికి మంచి బ్యాలెన్సింగ్ ఉండాలి.స్టీమ్ బాత్గర్భధారణ సమయంలో స్టీమ్ బాత్ చేయడం అనేది చెడు ఆలోచన. ఎప్పుడైతే మీ శరీరం వేడి పొందుతుందో, అప్పుడు మీ చర్మని బ్లెడ్ సెల్స్ రీడైరెక్ట్ గావింపబడి మీ చర్మాన్ని చల్లబరుస్తుంది.

# చిత్రభాను


## సైరా: నరసింహా రెడ్డి ఇంకా ఎప్పుడు మొదలు??

సైరా నరసింహా రెడ్డి టాలీవుడ్ చాలా ఇంట్రస్ట్ గా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్. టైటిల్ ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇంత హైప్ ఉన్న సినిమా ఇంకా ఒక్క న్యూస్ కూడా చెప్పటం లేదు. మెగాస్టార్ కెరీర్ లోనే ఇన పెద్ద బడ్జెట్ సినిమా ఇంతవరకూ రాలేదు. ఇంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ ని ప్రకటించీ ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావటం లేదు. పాత్రలూ, టెక్నీషియన్లూ అంతా సిద్దంగానే ఉన్నారు. అయినా అటు నిర్మాత రామ్ చరణ్ గానీ ఇటు దర్శకుడు సురేందర్ రెడ్డి గానీ ఏమీ చెప్పటం లేదు. ఆగమేఘాల మీద కథ సిద్దం చేసిన దర్శకుడు సురేందర్ రెడ్డి ఎందుకు ఇంత ఆలస్యం చేస్తున్నారు అనే విషయం ఎవ్వరికి అర్థం కావడం లేదు. సినిమా టైటిల్ ను ఫిక్స్ చేసి నెలలు కావొస్తోంది. కొన్ని నెలల క్రితమే స్టార్ట్ చేస్తామని చెప్పిన నిర్మాత రామ్ చరణ్ ఇంకా సినిమాను పట్టాలెక్కించలేదు. దర్శకుడు సురేందర్ రెడ్డి కూడా విదేశాలకు వెళ్లి గ్రాఫిక్స్ నిపుణులను కలిసి వచ్చాడు. అతను రాగానే అక్టోబర్ 20న మొదలవుతుందని చిత్ర యూనిట్ చెప్పింది. అయితే ఇప్పుడు మళ్లీ మరొక డేట్ ని ఫిక్స్ చేసుకుందట సైరా చిత్ర బృందం. అన్నీ ఒకేసారి సెట్ అయిన తర్వాత డిసెంబర్ మొదటి వారంలో సినిమాను మొదలు పెట్టి ఏ మాత్రం ఆపకూడదని అందరు అనుకున్నట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ కూడా అప్పుడు కొంచెం ఖాళీగా ఉంటాడట. దీంతో చిత్రాన్ని ఒక్కసారి సెట్స్ పైకి తీసుకెళితే అంతా సెట్ అవుతుందని డిసెంబర్ లోనే స్టార్ట్ చెయ్యాలని ఫిక్స్ అయ్యారు. మరి ఆ డేట్ అప్పుడైనా స్టార్ట్ చేస్తారో లేదా చూడాలి. నయనతార హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రానికి రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. అలాగే అమితాబ్ - జగపతి బాబు అండ్ సుదీప్ వంటి అగ్రనటులు సినిమాలో నటిస్తున్నారు.



## వైరల్ అవుతున్న శ్రీదేవి ముద్దుల ఫొటో

శ్రీదేవి టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అన్న మార్క్ లేకుండా మొత్తం ఇండియన్ సెల్యులాయిడ్ మీదనే అందాల, నటనా సంతకం చేసిన నటి. గ్రేట్ డైరెక్టర్ అని పిలుచుకునే రామ్‌గోపాల్ వర్మ తాను స్వయంగా శ్రీదేవికి ఎంతటి అభిమానినో చెప్తూనే ఉంటాడు. దాదాపు మూడు తరాల అభిమానులని తన వైపుకు తిప్పుకున్న శ్రీదేవి. ఇప్పటికీ వార్తల్లో, సినిమాల్లో తరచూ ఉంటూనే ఉంది. ఆమె మీద వచ్చే ఏ వార్త అయినా ఇంట్రస్ట్ గానే చూస్తూంటారు. కొన్నళ్ళ కిందట షార్ట్స్, టీ షర్ట్ లో గ్లామర్ ఏమాత్రం తగ్గని ఫొటోలు చూసి ఔరా..! అనుకున్నారంతా.. ఈ వయసులో శ్రీదేవి అందాలు చెక్కు చెదరలేదని పలువురు అభిమానులు పొగిడేస్తుంటే...మరికొందరేమో ఈ శ్రీదేవి ఈ వయసులో ఇంత హాట్ హాట్ ఫొటోలు పోస్టు చేయడం ఏమిటని ముక్కున వేలేసుకున్నారు. 50 ఏళ్ల వయసులోనూ శ్రీదేవి అతిలోక సుందరిలా నవనవలాడుతోందంటూ మీడియా కోడై కూసింది. ఈ పరిణామాలతో శ్రీదేవి ఒక్కసారిగా షాకైంది. ఆ ఫొటోలు ఎలా ట్విట్టరోకి వచ్చాయో అర్థం కావడం లేదని....బహుషా ఇది మా పిల్లల పనే అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేసింది. తనకు తెలియకుండానే ఈ ఫొటోలు ట్విట్టర్లోకి వచ్చాయని వివరణ ఇచ్చుకుంది.



## నటనకు గుడ్ బై..




లీడర్, మిరపకాయ, మిర్చి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన రిచా గంగో పాధ్యా రు గత కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చి తన స్టడీస్ లో బిజీగా ఉంది. అమెరికాలో పుట్టి పెరిగిన ఈ బెంగాలీ బ్యూటీ తన అందం తోనూ, నటన తోనూ బాగానే ఆకట్టుకుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళంలో కూడా ధనుష్, శింబు వంటి స్టార్ హీరోల సరసన కూడా ఈ భామ నటించింది. కెరియర్ మంచి ఫేమ్ లో ఉన్నప్పుడు సడెన్ గా ఈమె అమెరికా కు వెళ్ళిపోయింది.. సినిమాలకైతే దూరం అయ్యింది కానీ అభిమానులకు మాత్రం తన పేస్ బుక్, ట్విటర్ పేజీ లో ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ దగ్గరవుతుంది.. అసలు సినిమాలని నేను ప్రొఫెషన్ గా తీసుకోలేదని క్యాజువల్ గా ఆఫర్ రావడంతో హీరోయిన్ అయ్యానని.. సినిమా అంటే సీరియస్ గా తీసుకోలేదు కాబట్టే హీరోయిన్ గా ఆఫర్స్ వున్నా చేయకుండా అమెరికా వచ్చేసానని చెప్పిన రిచా ఇప్పుడు ఒక షాక్ ఇచ్చింది. నటించిన కొద్ది చిత్రాలకే చక్కని గుర్తింపు తెచ్చుకున్న రిచా గంగోపాధ్యాయ సినిమాలకు గుడ్ బై చెప్పేసింది. రానున్న రోజుల్లో ఇక నటించబోనని ట్వీట్ చేసింది. 2013లో చివరిసారిగా నాగ్ సరసన భాయ్ సినిమాలో నటించిన రిచా ఆ తర్వాత తాను మళ్లీ అమెరికా వెళ్లి ఎంబీఏ చేయదల్చుకున్నానని, ఇక సినిమాలకు గుడ్ బై చెబుతున్నానని అప్పట్లోనే స్పష్టంచేసింది. అయితే కొన్నాళ్ళకి మళ్ళీ నటించాల్సి వస్తే మొదటి ప్రిఫరెన్స్ టాలీవుడ్ కే అని అనటం తో ఇక మళ్ళీ వచ్చేస్తుందేమో అనుకున్నారంతా.. ఇటీవల ట్విట్టర్ ద్వారా రిచా తాను ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పినట్లు స్వయంగా చెప్పింది. ఆమె ఫాలోవర్లు కొందరు.. మీ నెక్స్ట ప్రాజెక్ట్ ఏంటి..? మళ్లీ సినిమాలు ఎప్పుడు చేస్తారు? అంటూ హీరోయిన్ రిచాకు తెగ ట్వీట్లు చేస్తున్నారట. దీంతో తన అభిమానులు, ట్విట్టర్ ఫాలోయర్లకు ఆమె వరుస ట్వీట్లతో వివరణ ఇచ్చింది. 'నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి అడుగుతున్నారు. కానీ అందరికీ నేనొక విషయం చెప్పాలనుకుంటున్నా. నా చివరి మూవీ విడుదలై దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. నా వివరాలు గూగుల్‌లో చూస్తే తెలుస్తుంది. ప్రస్తుతం నా జీవితంలో వేరే దశలో ఉన్నాను. ఇందులో నటన అనే అంశమే లేదంటూ' సినిమాలకు గుడ్ బై చెప్పేశానని నటి రిచా గంగోపాధ్యాయ్ వరుస ట్వీట్లతో చెప్పేసింది.

## బికినీ వేసుకుంటే కథకి నప్పదని

లావణ్యా త్రిపాఠి టాలీవుడ్ లోకి అందాల రాక్షసి లాంటి సినిమాతో అడుగు పెట్టి నటనకు మంచి మార్కులే వేయించుకుది కానీ అన్నీ అదే తరహా పాత్రలు రావటం తో తాను గ్లామర్ రేసులో వెనుక బడి పోతున్నానని గ్రహించింది. కానీ అప్పటికే పాపం జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ తర్వాత కాస్త గ్లామర్ డోస్ పెంచినా ఆకట్టుకోలేక పోగా ముందున్న ఇంప్రెషన్ మీద కూడా కాస్త దెబ్బ పడింది. ఆ త్ర్వాత వచ్చిన దూసుకెళ్తాలోనూ క్నిపించింది. అయితే... లావ్ణ్యకు గొప్ప అవ్కాశాలేం రాలేదు. న్టిగా ఓకే గానీ, గ్లామ్ విష్యంలో అత్తెస్రు మార్కులు తెచ్చుకొంది. అయితే మారుతి సినిమా 'భ్లె భ్లె మ్గాడివోయ్'తో ఆమె దశ తిరిగింది. ఈ సినిమా తర్వాత వచ్చిన సోగ్గాడే చిన్ని నాయిన్'లో మరింత గ్లామ్ గా కనిపించింది. మరింత వ్నె తెచ్చుకొంటూ.. స్క్రీన్ ప్రెజెన్స్‌తో అంద్రి మ్తిపోగొట్టింది. అయితే ఆ క్రేజ్ కూడా ఎక్కువకాలం నిలబడాలంటే వార్తల్లో ఉండాలి కదా..., వార్తల్లో ఉండాలంటే ఆఫర్లూ ఉండాలి. అవే ఇప్పుడు కావల్సింది... ఇప్పటికైతే పాపం ఆశలన్నీ రామ్ హీరోగా వస్తున్న ఉన్నది ఒకటే జిందగీ పైనే ఆశలన్నీ పెట్టుకుంది.

'నేను రియల్ లైఫ్ లో అందాల రాక్షసి క్యారక్టర్ కు ఇసుమంత దగ్గరగా కూడా ఉండను. అంతా కూడా మోడ్రన్ గానే ఉంటాను. అలాగే మోడలింగ్ సమయంలో కూడా గ్లామర్ నే ఒలకబోశాను. అందుకే నేను చాలాసార్లు నా డైరక్టర్లకు చెప్పాను.. నాకు గ్లామర్ రోల్స్ ఇవ్వండి అని. అంటూ తాను ఎక్స్పోజింగ్ కి సిద్దం అని చెప్పినా దర్శకులు మాత్రం అంత ధైర్యం చేయలేకపోయారు.

అయితే ఎట్టకేలకు ఉన్నది ఒకటే జిందగీ సినిమా కోసం అమ్మడు బికినీలో మెరిసిందట. కాని అక్కడ సినిమా కంటెంట్లో ఉన్న ప్రేమకథకి.. ఈ కమర్షియల్ గ్లామర్ కి పొంతన లేకపోవడంతో .. ఈ బికినీ సీన్ ఎందుకులే అని ఎడిటింగ్ దగ్గరే తీసేశారని టాక్. . పాపం దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదని. హీరోయిన్ ఒప్పుకున్నా కథ మాత్రం అడ్డుపడిందన్న మాట. బికినీలో లావణ్యా త్రిపాఠిని చూడటానికి మళ్ళీ వెయిట్ చేయాలన్న మాట.



## స్నేహం కోసం హీరోను మార్చేసిన త్రివిక్రమ్..



టాలీవుడ్‌లో మాటల మాంత్రికుడు, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. అందుకు ప్రధాన కారణం ఆయన వ్యక్తిత్వం. పాటించే విలువలు. ఎవరికైనా మాట ఇస్తే దానిని పక్కాగా అమలు చేయడానికి ప్రయత్నిస్తాడు అనే పేరు త్రివిక్రమ్‌కు ఉంది. మానవ సంబంధాలకు కూడా మంచి ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా సినిమాల్లో కూడా వాటిని బలంగా చూపుతాడు. గతంలో ఇచ్చిన మాట కోసం తాజాగా ఎన్టీఆర్ చిత్రంలో ఓ హీరోనే మార్చారనే ఓ నిరాధారమైన వార్త వెలుగులోకి వచ్చింది. ఆ వార్త సారాంశం ఏమిటంటే.. తాజాగా ప్రారంభమైన ఎన్టీఆర్ చిత్రంలో ఓ కీలకమైన పాత్ర ఉందట. ఆ పాత్ర కోసం ముందుగా నారా రోహిత్‌ను అనుకొన్నారట. ఎన్టీఆర్, నారా రోహిత్ ఇద్దరూ నందమూరి కుటుంబానికి చెందిన వారే కావడంతో సినిమాకు ఓ క్రేజ్ కూడా వస్తుంది అని ఆశించారు. కానీ తీరా షుటింగ్ ప్రారంభమయ్యే సరికి నారా రోహిత్ ఈ చిత్రంలో లేడనే విషయం ఆసక్తిని రేకెత్తించింది. నారా రోహిత్ స్థానంలో ప్రస్తుతం తన మిత్రుడు సునీల్ తెరపైకి రావడం ఫిలిం సర్కిల్స్‌లో చర్చనీయాంశమైంది. ఈ డిసిషన్ వెనుక గతంలో సునీల్‌కు త్రివిక్రమ్ మాటివ్వడమే అనే మాట వినిపిస్తున్నది.

కామెడీ నటుడిగా విశేష ప్రజాదరణను కూడగట్టుకొన్న సునీల్ హీరో అవతారం ఎత్తాడు. మొదట్లో విజయాలు పలకరించినా ఆ తర్వాత ముఖం చాటేశాయి. హీరోగా స్థిరపడటానికి సునీల్ సిక్స్ ప్యాక్ లాంటి ప్రయోగాలు చేశాడు. కానీ ఈ మధ్య బొత్తిగా విజయాలు లేవు. దాంతో సునీల్‌లో టెన్షన్ మొదలైంది.



### ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో

# భారత్‌కు స్వర్ణం



దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీల్లో భారత్ శుభారంభం చేసింది. 10మీటర్ల పిస్తల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో జీతూ రాయ్-హీనా సిద్ధూ జోడీ స్వర్ణ పతకం కైవశం చేసుకుంది. ఫ్రాన్స్ రజత పతకాన్ని కైవశం చేసుకోగా.. చైనా కాంస్యంతో సరిపెట్టుకుంది.

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీలు తొలిసారి భారత్ వేదికగా జరుగుతున్నాయి. ఫైనల్ పోటీల కోసం జరిగిన క్వాలిఫైయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన జీతూ జోడీ ఆ తర్వాత జరిగిన ఫైనల్‌లోనూ అదే ప్రదర్శన కొనసాగించారు. దీంతో ఫైనల్లో జీతూ-సిద్ధూ జోడీ 483.4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 481.2 పాయింట్లతో ఫ్రాన్స్, 418.2 పాయింట్లతో చైనా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

సొంతగడ్డపై స్వర్ణపతకం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. స్వర్ణం గెలిచినప్పటికీ ఇప్పటికీ మాపై ఎంతో ఒత్తిడి ఉంది. సొంత అభిమానులు మధ్య మాపై అంచనాలు పెరిగాయి. దీంతో గతకొద్ది రోజుల నుంచి ఇద్దరం కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొన్నాం అని పతకాలు స్వీకరించిన అనంతరం జీతూ-సిద్ధూ జోడీ తెలిపారు.

### 3వేలమంది పోలీసులతో
## అసెంబ్లీ బందోబస్తు : సీపీ



హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలకు 3వేల మంది పోలీసులతో బందోబస్తు కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బందోబస్తుపై శాసనసభ స్పీకర్ మధుసుదనాచారి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో సమీక్షించామన్నారు. శాంతిభద్రతలకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

# పాతబస్తీకి రూ. 41.71 కోట్లు

### నియోజకవర్గాల వారీగా కేటాయింపు



హైదరాబాద్: పాతబస్తీలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధిని విడుదల చేసింది. మొత్తం 8 నియోజకవర్గాల పరిధిలో చేపట్టే పనులకు రూ.41.71 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన విజ్ఞప్తిపై స్పందించి ఈ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టనున్నారు. బహదూర్‌పుర నియోజకవర్గానికి రూ.5 కోట్లు (పనులు-69), చాంద్రాయణగుట్టకు రూ.5.19 కోట్లు (185), చార్మినార్‌కు రూ.5 కోట్లు (114), గోషామహల్‌కు రూ.5.59 కోట్లు (36), కార్వాన్ .. రూ.5.40 కోట్లు (67), మలక్‌పేట .. రూ.5.39 కోట్లు (59), నాంపల్లికి రూ.5.07 కోట్లు (37), యాఖుత్‌పురాకు రూ.5.16 కోట్లు (59 పనులు) మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### యంగ్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాంకు

## నాగార్జున విద్యార్థుల ప్రాజెక్టు

రాయదుర్గం: ఐఐటీ ఖరగ్‌పూర్ యంగ్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాంకు రాయదుర్గం నాగార్జున పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. ఖరగ్‌పూర్ ఐఐటీవారు దేశవ్యాప్తంగా యంగ్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాం పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా సరికొత్త ఆలోచనల ఆవిష్కరణలను ఆహ్వానించారు. తొలిదశలో 300 పాఠశాలలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించగా 50పాఠశాలలు రెండో దశకు ఎంపికయ్యాయి. అందులోనూ వడపోత చేపట్టగా 20పాఠశాలలు ఫైనల్‌కే చేరాయి. ఇందులో తెలంగాణనుంచి తమ పాఠశాల మాత్రమే ఉందని నాగార్జున పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రోయింగ్ ప్లాంట్స్ విత్‌ఔట్ సాయిల్(హైడ్రో ఫోనిక్స్.. మట్టిలేకుండా మొక్కలు పెంచడం) అనే ప్రాజెక్ట్‌ను ఈ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు ప్రిన్స్, రాము, 9వతరగతి విద్యార్థి బద్రినాథ్ కలిసి రూపకల్పన చేశారు. ఈనెల 26నుంచి 30వతేదీ వరకు ఖరగ్‌పూర్ ఐఐటీలో ఐఐటీ యంగ్ ఇన్నోవేటివ్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. అందులో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా సోమవారం ఆ విద్యార్థులు ఎంఈవో రామచంద్రరావుతో కలిసి జిల్లా విద్యాధికారి సత్యనారాయణను ఆయన కార్యాలయంలో కలిశారు. వారిని డీఈవో అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, కరెస్పాండెంట్ భరత్‌కుమార్‌లను కూడా అభినందించారు.

## బెజవాడ దుర్గమ్మ లడ్డూ ధర పెంపు

విజయవాడ: బెజవాడ కనకదుర్గమ్మ ప్రసాదాలు భక్తులకు ప్రియం కానున్నాయి. మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో లడ్డూలతో పాటు వివిధ సేవల ధరలను పెంచాలని నిర్ణయించారు.

**పాలకమండలి నిర్ణయాలివే..**

లడ్డూ ధర రూ.10 నుంచి రూ.20కి పెంపు

రూ.100 ధరతో తొలిసారిగా భక్తులకు శ్రీచక్ర లడ్డూ అందుబాటులోకి

మల్లికార్జున మహామండపం, కనకదుర్గనగర్‌లో భక్తుల కోసం రెండు షెడ్లు నిర్మాణం

మల్లికార్జున మహామండపం ద్వారా వచ్చేవారికి ప్రస్తుతానికి ఉచితంగా లిఫ్ట్ సౌకర్యం

దసరా ఉత్సవాల్లో పనిచేసిన ఉద్యోగులకు ప్రోత్సాహకంగా రూ.5వేలు

తలనీలాల టిక్కెట్ ధర రూ.15 నుంచి రూ.20కి పెంపు

### ఇండియన్ టీమ్‌లో

## రంగు, జాతి, మతానికి చోటు లేదు!



న్యూఢిల్లీ: ఆయనో ఐపీఎస్ ఆఫీసర్.. కానీ ట్విట్టర్‌లో నోరు జారాడు. ఇండియన్ టీమ్‌లో ముస్లింలకు చోటివ్వరా అంటూ ప్రశ్నించాడు. ఇది చూసి ఒళ్లు మండిన హర్భజన్‌సింగ్.. ఆయనకు దిమ్మదిరిగే రిప్లై ఇచ్చాడు. ఆ ఐపీఎస్ ఆఫీసర్ ఎవరో కాదు.. గతంలో 2002 గుజరాత్ అల్లర్ల కేసులో మోదీ పాత్రపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సంజీవ్ భట్. అప్పట్లో ముస్లింలపై దాడులు చేయాలని మోదీ హిందువులకు పిలుపునిచ్చిన మీటింగ్‌కు తాను వెళ్లినట్లు ఈ భట్ చెప్పుకున్నాడు. మళ్లీ ఇన్నాళ్లకు ఓ వివాదాస్పద ట్వీట్‌తో వార్తల్లో నిలిచాడు. ఇండియన్ టీమ్‌లో ఎంతమంది ముస్లింలు ఉన్నారు? స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఇప్పటివరకు ఇలా ఒక్క ముస్లిం సభ్యుడు లేకుండా ఉన్న సందర్భాలు ఎన్ని ఉన్నాయి? ముస్లింలు క్రికెట్ ఆడటం మానేశారా? లేక సెలక్టర్లు మరెవరి బాటలోనో వెళ్తున్నారా? అంటూ పరోక్షంగా మోదీని ఉద్దేశించి ఓ ట్వీట్ చేశాడు.

## డిసెంబరులో కోహ్లీ-అనుష్క పెళ్లి?



ముంబయి: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ, బాలీవుడ్ నటి అనుష్క శర్మ ఎప్పుడెప్పుడు పెళ్లి కబురు చెబుతారా అని క్రికెట్, సినీ అభిమా నులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. తాజాగా వీరిద్దరూ డిసెంబరులో పెళ్లి పీటలెక్కనున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే దీనిపై ఇరువురికి చెందిన కుటుంబ సభ్యుల నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

కోహ్లీ వ్యక్తిగత కారణాల వల్ల డిసెంబరులో క్రికెట్ నుంచి విశ్రాంతి కల్పించమని బీసీసీఐని కోరిన సంగతి తెలిసిందే. దీంతో పెళ్లి కోసమే కోహ్లీ విరామం అడిగాడని పలువురు అభిప్రాయపడు తున్నారు. ఈ మధ్య ఓ వస్త్ర దుకాణ ప్రచార ప్రకటనలో వీరిద్దరూ కలిసి సందడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంది.

డిసెంబరు చివరి వారంలో భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు ముందుగానే వివాహం చేసుకోవాలని భావించిన కోహ్లీ శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌ల నుంచి విశ్రాంతి కోరినట్లు సమాచారం. ఐపీఎల్ నుంచి కోహ్లీ ఇప్పటి వరకు క్రికెట్ ఆడుతూనే ఉన్నాడు. అతడికి విశ్రాంతి ఇవ్వాల్సి ఉంది. రొటేషన్ విధానంలో భాగంగా శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం కోహ్లీకి విశ్రాంతి ఇవ్వాలన్న అంశాన్ని పరిశీలిస్తున్నాము.

అని ప్రధాన సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్న సంగతి తెలిసిందే.

ప్రస్తుతం కోహ్లీ.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతున్నాడు.

## పెద్దాయన మొండితనం : బీసీసీఐకి శాపం!

### కోచి టస్కర్స్‌కు రూ.850 కోట్ల పరిహారం

దిల్లీ: ఆ పెద్దాయన మొండితనం.. అధికారుల అలసత్వం.. బీసీసీఐ పాలిట శాపంగా మారింది. ఇప్పుడు దాదాపు రూ.850 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి వస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి 2011లో రద్దు చేసిన కోచి టస్కర్ కేరళ ఫ్రాంచైజీకి రూ.800 కోట్ల కన్నా ఎక్కువ పరిహారం చెల్లించాల్సిన గత్యంతరం లేని దుస్థితిని ఎదుర్కొంటోంది బీసీసీఐ.

కోచి టస్కర్స్ రూ.850 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. దీన్ని మేం ఐపీఎల్ జీసీ సమావేశంలో చర్చించాం. ఇప్పుడు జనరల్ బాడీ ముందు సమస్యను ఉంచబోతున్నాం. ఇక తుది నిర్ణయం వారు తీసుకోవాల్సిందే. ఐతే బేరసారాల తప్పక ఉంటాయి అని ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా అన్నారు.



**ఇదీ నేపథ్యం**

బీసీసీఐ అధ్యక్షుడైన శశాంక్ మనోహర్ 2011లో కోచి టస్కర్ ఫ్రాంచైజీ ఒప్పందాన్ని రద్దు చేశారు. పాలక మండలి సభ్యులంతా వ్యతిరేకిస్తున్నా మొండితనంతో ఒక్కరే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ముస్లిం మైనార్టీలకు మహర్దశ

### స్వయం ఉపాధి లబ్ధిదారులకు రూ.2.75 లక్షల వరకు ఆర్థిక సాయం

### త్వరలో ఉర్దూ టీచర్ పోస్టుల భర్తీ .. ఉర్దూలోనూ పోటీ పరీక్షలు, ఎంట్రన్స్ టెస్టులు

హైదరాబాద్ : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సమగ్రాభివృద్ధికి పాటుపడుతామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. ముస్లింలలో పేదరికాన్ని రూపుమాపేందుకు పలు కీలక నిర్ణయాలను ఆయన ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిర్మించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ముస్లింలకు కనీసం పదిశాతం కోటా ఇస్తామని చెప్పారు. నిరుద్యోగ ముస్లిం యువత స్వయం ఉపాధి పొందేందుకు రూ.లక్ష నుంచి రూ.2.75 లక్షల వరకు యూనిట్లకు వందశాతం సబ్సిడీపై ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ నగర పరిధిలో ముస్లింలకోసం ప్రత్యేకంగా పారిశ్రామికవాడను, ప్రత్యేక ఐటీ కారిడార్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషలతోపాటు ఇకపై పోటీ పరీక్షలు, ఎంట్రన్స్ టెస్టులను ఉర్దూభాషలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యవసర పనుల కోసం సత్వరమే రూ.41.70 కోట్లను ఎస్డీఎఫ్ నుంచి విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎఫ్‌సీ), ఉర్దూ అకాడమీ, వక్ఫ్‌బోర్డులు మరింత సమర్థంగా పనిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రగతి భవన్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమంపై సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మైనార్టీల కోసం చేపట్టిన కార్యక్రమాల అమలుతీరును సమీక్షించారు. భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చినప్పుడే ఇక్కడి మైనార్టీల జీవితాల్లో వెలుగు వస్తుందని తెలంగాణ ఉద్యమ సమయంలోనే తాను అనేకమార్లు చెప్పానని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. మైనార్టీల్లో అత్యధిక శాతం పేదరికంలో ఉన్నారని, ఆ పేదరికాన్ని రూపుమాపేందుకు మన కార్యాచరణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీలు తప్పకుండా లబ్ధిపొందేలా కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ఎస్సీ, ఎస్టీల్లా పేదరికంలో మైనార్టీలు**

ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే రాష్ట్రంలో మైనార్టీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మైనార్టీల్లో ముస్లింలే ఎక్కువ. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే మైనార్టీల్లో అత్యంత పేదరికం ఉంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం కూడా మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. బడ్జెట్లో కేటాయింపులు పెంచాం. చాలా కొత్త కార్యక్రమాలు అమలుచేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీల నిధులు ఎలా ఖర్చు చేస్తున్నామో మైనార్టీల కోసం కూడా అలాగే ఖర్చు చేయాలి. రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం. ఏ ఒక్క వర్గం వెనుకబడిపోయినా అది సంపూర్ణ ప్రగతి కాదు అని సీఎం అన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు కే తారక రామారావు, ఈటల రాజేందర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అసెంబ్లీలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు ఏకే ఖాన్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితరాణా, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.








VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com